




తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 36 | 7.9.2026 నుంచి 13.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com







# 'లోకల్' ఫైట్‌కు రెడీ!

- స్థానిక సమరానికి కూటమి సన్నద్ధం
- టీడీపీ స్పీడ్.. జనసేన వరుస భేటీలు..
- అక్టోబర్ టార్గెట్‌గా ఎన్నికల కసరత్తు



**అమరావతి :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఎన్నికలను అనుకున్న సమయానికే నిర్వహించే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేస్తోంది. జనసేన అధిష్ఠానం ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తుండగా.. టీడీపీ సైతం ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేసింది. ఈ నెల 7, 8వ తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణ, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణ సహా ఏడు కీలక అంశాలపై ఈ శిక్షణ ఉండనున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా హాజరు కావాలని టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశించినట్లు తెలుస్తోంది.

### లోకేష్ దిశానిర్దేశం..

అమరావతిలో టీడీపీ మంత్రులతో మంత్రి నారా లోకేష్ నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలోనూ స్థానిక ఎన్నికలే ప్రధాన చర్చగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని లోకేష్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అక్టోబర్ నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేలా సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

### దశలవారీగా ఎన్నికలు..

మొదట మున్సిపల్ ఎన్నికలు.. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ.. చివరగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు లోకేష్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన కేసులను పరిష్కరించుకుని అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

### ఓటర్ల జాబితాపై వైసీపీ పట్టు..

ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా కూడా కీలక అంశంగా మారింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో రూపొందే తుది ఓటర్ల జాబితానే స్థానిక ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోవాలని వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయానికి అమల్లో ఉన్న, చెల్లుబాటయ్యే ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించవచ్చన్నది ప్రభుత్వ వైఖరిగా తెలుస్తోంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలను నిలిపివేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావిస్తోంది.

### బీసీ రిజర్వేషన్లపైనా వ్యూహం..

బీసీ రిజర్వేషన్ల అంశంలో న్యాయపరమైన అభ్యంతరాలు ఎదురైనా వాటిని అధిగమించే మార్గాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అవసరమైతే పార్టీ పరంగా బీసీలకు ఓసీ జనరల్ కేటగిరీలోనూ సీట్లు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని టీడీపీ భావిస్తున్నట్లు సమాచారం. ఇలా ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఒకవైపు న్యాయపరమైన, పరిపాలనా అంశాలను చక్కదిద్దుకుంటుండగా.. మరోవైపు కూటమి పార్టీలు రాజకీయంగా తమ శ్రేణులను సిద్ధం చేసుకుంటున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో ఏపీలో స్థానిక ఎన్నికల రాజకీయం మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### చంద్రబాబు కీలక భేటీ..

మరోవైపు సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులు, కీలక నేతలతో సమావేశమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, కూటమి పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి సారించినట్లు అర్థం అవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు, కార్యకర్తల ఆమోదం, పనితీరు ఆధారంగానే అభ్యర్థుల్ని ఎంపిక చేస్తామని.. యువత, మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు చెప్పారు. అక్టోబరులో వారం వ్యవధిలోనే పట్టణ స్థానిక సంస్థలు, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని.. అవసరమైతే అంతకుమించి ఇస్తామే తప్ప ఒక్క శాతం కూడా తగ్గించబోమని స్పష్టం చేశారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్యాప్ రాకూడదని నిర్దేశించారు.

## 4 రాష్ట్రాల్లో ముందస్తు జన గణన

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో జన గణన ప్రక్రియను ముందుగానే ప్రారంభిస్తున్నట్లు రిజి?రస్టార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్‌జీఐ) శనివారం వెల్లడించారు. గోవా, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలతోపాటు ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 2026 డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4వ తేదీ వరకు జరుగుతుందని తెలియజేశారు. అలాగే 2027 జనవరి 5 నుంచి 2027 జనవరి 9 వరకు దీనికి సంబంధించిన పునఃపరిశీలన దశ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్‌జీఐ, జనాభా గణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా ప్రాంతాల్లోని పౌరులు 2026 నవంబర్ 16 నుంచి నవంబర్ 30 వరకు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే (ఎల్ఫ్ ఎన్యూమరేషన్) అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా జనగణన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనుంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మాత్రం ముందుగానే నిర్వహించబోతున్నారు.

## పర్యాటకంలో 4 కొత్త గమ్యస్థానాలు



**అమరావతి:** స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ.419.30 కోట్లతో అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనుంది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ.152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతోపాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ.101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరుధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.107.94 కోట్లతో 'అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున ఉన్న చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు. డిజిటల్ ప్రదర్శనలు, మ్యూజియం, హస్తకళల అనుభవాలు, తదితర సదుపాయాలతో నాగావళి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తారు.

## మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు కొత్త నిబంధనలు

**సత్తెనపల్లి న్యూస్,అమరావతి:** రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీచేసింది. మేయర్ ఎన్నికను ప్రత్యక్ష విధానంలో నిర్వహిస్తుండడంతో అందుకు నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. మేయర్, కార్పొరేటర్ల ఎన్నికల నిర్వహణకు సంబంధించి 'ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ (కాండక్ట్ ఆఫ్ ఎలక్షన్ ఆఫ్ మేయర్ అండ్ వార్డు మెంబర్స్) రూల్స్-2026'ను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శనివారం జీఓఎంఎస్ నంబర్ 211 జారీచేసింది. ఈ కొత్త నిబంధనలు మున్సిపల్ కార్పొరేషన్లకు మాత్రమే వర్తిస్తాయి.

**ఒక ఓటరు.. రెండు ఓట్లు..** ఒక ఓటరు ఈ ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థికి ఒక ఓటు, మేయర్‌కు ఒక ఓటు వేయాల్సి ఉంటుంది. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేయకూడదనుకునే వారికి నోటా అవకాశం కల్పించారు. రీ మేయర్ లేదా కార్పొరేటర్‌గా పోటీచేసే సాధారణ అభ్యర్థి రూ.5,000 డిపాజిట్ చెల్లించాలి. అదే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రూ.2,500గా నిర్ణయించారు. ఒకే వార్డుకు ఒక అభ్యర్థి నాలుగు నామినేషన్లు దాఖలు చేసినా ఒక డిపాజిట్ సరిపోతుంది. ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. నామినేషన్‌తో పాటు క్రిమినల్ కేసులు, ఆస్తులు, అప్పులు, విద్యార్హతల వివరాలతో అఫిడవిట్ సమర్పించాలి. అంధులు, శారీరక వైకల్యం కారణంగా స్వయంగా ఓటు వేయలేని వారికి 18 ఏళ్లు నిండిన సహాయకుడి ద్వారా ఓటువేసే అవకాశం ఉంటుంది. అయితే, ఒకే సహాయకుడు ఒకరి కంటే ఎక్కువమందికి సాయం చేయకూడదు. పోలింగ్ ఏజెంట్ ఓటరు గుర్తింపును సవాలు చేయవచ్చు. ఇందుకు రూ.10 డిపాజిట్ చేయాలి. ప్రిసైడింగ్ అధికారి విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటారు. ఎన్నికల విధుల్లో ఉన్న అర్హులైన సిబ్బంది, రాష్ట్రం వెలుపల విధుల్లో ఉన్న సాయుధ దళాల సిబ్బంది, చట్టపరమైన నిర్బంధంలో ఉన్న అర్హులైన ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేసే అవకాశం ఉంటుంది. ఫలితాలు ప్రకటించిన తర్వాత అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ రాతపూర్వకంగా రీకౌంటింగ్ కోరవచ్చు. దానిపై నిర్ణయం తీసుకునే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉంటుంది. ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థికి వచ్చిన చెల్లుబాటు అయ్యే ఓట్లు మొత్తం చెల్లిన ఓట్లలో 1/6 కంటే ఎక్కువ లేకపోతే డిపాజిట్ జప్తు అవు తుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల పత్రాలు, ఓటర్ల జాబితాలను సీలు చేసి సురక్షితంగా భద్రపరుస్తారు.

## ఏపీలో కదులుతున్న డీఎస్సీ అక్రమాల డొంక

**సత్తెనపల్లి న్యూస్, విశాఖపట్నం:** ఏపీలో డీఎస్సీ అక్రమాల డొంక కదులుతోంది. టెట్ అర్హత లేకుండా టీచర్ ఉద్యోగాలు.. డీఎస్సీ కుంభకోణం బద్దలవుతోంది. వరుస అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయి. విశాఖలో ఒకే కుటుంబంలో ఇద్దరికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. టెట్ అర్హత లేకుండానే ఉద్యోగాలు ఇచ్చినట్టు తేలింది. టెట్ పాస్ కాకుండానే టీచర్ ఉద్యోగం పొందిన చిల్లా యోగీశ్వరరావు.. అతని చెల్లి మోహిని దేవికి కూడా స్పోర్ట్స్ కోటాలో టీచర్ పోస్ట్ వచ్చింది. టెట్ సెర్టిఫికెట్ పెట్టకపోయినా యోగీశ్వరరావుకి ఎస్జీటీ ఉద్యోగం ఇచ్చేశారు. టెట్ అర్హత రావాలంటే 75 మార్కులు రావాలి.. మూడుసార్లు టెట్ రాసినా 75 మార్కులు రాలేదు. అయినా చంద్రబాబు సర్కార్ ఉద్యోగం ఇచ్చేసింది. కాగా, స్పోర్ట్స్ కోటా పేరుతో నచ్చినోళ్లకు నకిలీ సర్టిఫికేట్లు ఇచ్చేసి ఆ సర్టిఫికెట్లతో ఉద్యోగాలిచ్చేసిన కుంభకోణం ఇప్పుడు రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఎక్కడో ఒకచోట నకిలీ సర్టిఫికెట్ బయటపడు తోంది.. మరోచోట వేరొకరి ధ్రువపత్రంతో ఉద్యోగం కొట్టేశారన్న ఫిర్యాదు వస్తోంది.. ఇంకొకచోట గడువు ముగిసిన తర్వాత సర్టిఫికెట్ మార్చుకునే అవకాశం ఎలా వచ్చిందన్న ప్రశ్న తలెత్తుతోంది. మరొక వ్యవహారంలో గుర్తింపు లేని క్రీడా సంఘం ధ్రువపత్రాలతోనే



కొలువులు దక్కాయన్న ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఒకే నియామక ప్రక్రియలో ఒక్కొ క్కరికి ఒక్కో నిబంధన వర్తించినట్లుగా కనిపిస్తుండటమే ఇప్పుడు అసలు అనుమానాలకు తావిస్తోంది. మెరిట్‌లో ముందున్నవారికి అన్యాయం జరిగిందన్న ఆరోపణల నుంచి.. అనుమానాస్పద సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వ్యవహారాల వరకు.. ఒక్కొక్కటిగా బయటకొస్తున్న ఉదంతాలు మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఎంపిక ప్రక్రియలో జరిగిన అక్రమాలను బయటపెడుతున్నాయి.

## ఏపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా పీవీ మోహన్

**సత్తెనపల్లి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు చెందిన ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి పీవీ మోహన్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా ఉన్న తమిళనాడు ఎంపీ మాణికం ఠాగూర్ స్థానంలో ఈయన్ను నియమిస్తున్నట్లు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. మోహన్ ఇదివరకు కేరళ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఉన్నారు. అలాగే ఏపీకి చెందిన సిరివెళ్ల ప్రసాద్‌ను మహారాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమించారు. అస్సాం ఇన్‌ఛార్జిగా ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్, గుజరాత్ ఇన్‌ఛార్జిగా రాజ్యసభ సభ్యుడు రణ్‌దీప్‌సింగ్ సూర్జేవాలా, పంజాబ్ ఇన్‌ఛార్జిగా రాజస్థాన్ సీనియర్ నేత సచిన్ పైలట్ నియమితులయ్యారు.

## ఉద్యోగులను మోసగిస్తున్న సర్కారు



**సత్తెనపల్లి న్యూస్ :** చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు అయినా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా వారిని మోసం చేస్తోందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. ఆయన శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చర్చలకు పిలుస్తే ఏదో చేస్తారని ఆశపడి వెళ్లారని, చివరికి రెండు డీఏలు, పోలీసులకు ఒక సరెండర్ లీవు ఇచ్చి నిరాశే మిగిల్చారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఐదు డీఏలు పెండింగ్ ఉంటే రెండే ఇస్తారా అని ప్రశ్నించారు.

ఈమాత్రం దానికే ఉద్యోగ సంఘం నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం విచిత్రంగా ఉందన్నారు. పీఆర్సీ కమిషన్, ముఖ్యమైన ఐఆర్ ఎక్కడని నిలదీశారు. సీపీఎస్ విషయంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు కూటమి ప్రభుత్వం ఇచ్చిందో లేదో సమాధానం చెప్పాలన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించామని చెబుతున్న చంద్రబాబు సర్కారు ఆ వివరాలు ఇవ్వాలని కోరితే ఆర్థిక శాఖ వద్ద లేవంటున్నారన్నారు. మరి బకాయిలు చెల్లించామని ఎలా చెప్పుకొంటారని ప్రశ్నించారు.

### వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఉద్యోగులకు మేలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఉద్యోగులకు మేలు జరిగిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 27 శాతం ఐఆర్ ఇచ్చిందని, అన్ని వర్గాల వారికి జీతాలు పెంచిందని, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోకి తీసుకుందని గుర్తు చేశారు. కరోనా సమయంలో కేంద్రం డీఏలను ఫ్రీజ్ చేస్తే.. అది అయిపోగానే గత ప్రభుత్వం ఒక్కసారే ఐదు డీఏలు ఇచ్చిందని తెలిపారు. కరోనా సంక్షోభం కారణంగా ఫిట్‌మెంట్ 23 శాతం ఇస్తే రివర్స్ పీఆర్సీ అని చంద్రబాబు అంటున్నారని, మీకు చేతనైతే ఆ రివర్స్ పీఆర్సీ అయినా ఇవ్వండని అన్నారు. రెండున్నరేళ్లుగా ఐఆర్ లేకుండా ఉండటం ఎప్పుడూ జరగలేదన్నారు. ఈరోజు ఐఆర్ లేదు, పీఆర్సీ లేదు, పింఛను స్కీమ్ కూడా లేవన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి భజన చేయడం మొదలు పెడితే ఇక ప్రభుత్వం సమస్యలు ఎందుకు పరిష్కరిస్తుందని ప్రశ్నించారు.

### ఉపాధ్యాయుల సస్పెన్షన్లపై ఆగ్రహం

చంద్రబాబు ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచడం తప్ప జీతాల పెంపు, ప్రమోషన్లు లేవన్నారు. వందలాది ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఉన్న టీచర్లను టెట్ రాయాలంటారు కానీ.. వాళ్లు మాత్రం టెట్ లేకుండానే ఉద్యోగాలిస్తారని ఎద్దేవా చేశారు. డీఎస్సీలో ఎంపికైన ఉద్యోగులతో ర్యాలీలు చేయిస్తూ రాజకీయాలకు వాడుకోవడం దారుణమన్నారు. టెట్ గురించి కేంద్ర మంత్రిని కలిస్తే వారిపై అబద్ధపు ప్రచారం చేసి సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు ఈ ప్రభుత్వం ఉద్యోగులకు ఏమీ చేయదని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వరదారెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఎస్వీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మన కుల్ఫీకి ప్రపంచమే ఫిదా..



కుల్ఫీకి ప్రపంచస్థాయిలో దక్కిన ఈ గుర్తింపు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. అసలు మన కుల్ఫీకి ఈ స్థానం ఎలా దక్కింది? ఇందులో ఉన్న ప్రత్యేకత ఏమిటి? ప్రపంచాన్ని మెప్పించిన ఈ చల్లని భారతీయ డెసర్ట్ గురించి ఇప్పుడు చూద్దామా? ప్రసిద్ధ ఫుడ్ అండ్ ట్రావెల్ గైడ్ 'టేస్ట్‌అట్లాస్' విడుదల చేసిన ప్రపంచంలోనే 50 అత్యుత్తమ ఫ్రోజెన్ డెసర్ట్‌ల జాబితాలో భారతదేశానికి చెందిన సాంప్రదాయ ఐస్‌క్రీమ్ 'కుల్ఫీ' 7వ స్థానాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా లభించే ఇటాలియన్ జెలాటో, టర్కిష్ దొందుర్మా వంటి ప్రసిద్ధ డజర్ట్‌లతో పోటీపడి ఈ ఘనత సాధించింది. పాలను మరిగించి చిక్కబరిచిన తర్వాత కుంకుమపువ్వు, యాలకులు, పిస్తా, బాదం వంటి వాటిని కలిపి దీనిని తయారు చేస్తారు. అంతేకాకుండా, ఎందరికో ఇష్టమైన 'కుల్ఫీ ఫలూదా' 33వ స్థానంలో చోటు సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో ఇండియన్ స్వీట్స్ ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పింది.

## త్వరలోనే కేబినెట్‌లో భారీ మార్పులు?




**చెన్నై:** శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే తమిళనాడు ప్రభుత్వం తమ మంత్రివర్గంలో భారీ మార్పులు, చేర్పులు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. కొన్ని నెలలుగా మంత్రుల పరిపాలనా సామర్థ్యం, పనితీరుపై చేయించిన సర్వేలు, అంతర్గత విచారణ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆశించిన స్థాయిలో రాణించని వారికి, వివాదాల్లో చిక్కుకున్న వారికి పదవుల నుంచి ఉద్వాసన పలికి , సమర్థులైన కొత్తవారికి కీలక శాఖలు అప్పగించేందుకు సీఎం విజయ్ ప్రణాళికలు రచిస్తున్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో మరింత వేగం పెంచేందుకు పరిశ్రమల శాఖనుఅధవ్ అర్జునకు అప్పగించే అవకాశం ఉన్నట్టు చర్చ జరుగుతోంది. అలాగే, పాఠశాల విద్యా శాఖను అనుభవజ్ఞుడైన సెంగోట్టయాన్‌కు అప్పగించవచ్చని భావిస్తున్నారు.మంత్రి రాజ్ మోహన్‌కు ఇతర ముఖ్య బాధ్యతలు కేటాయించనున్నట్లు సమాచారం. అలాగే, పరిశ్రమల మంత్రి కీర్తనకు మానవ వనరుల అభివృద్ధిశాఖను అప్పగించే యోచనతో పాటుగా మరి కొందరి స్థానాలు కదిలించే దిశగా టీవీకే నాయకత్వం ఉన్నట్టు చర్చ జరుగు తోంది. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు విశ్వనాథన్, రాజేష్ కుమార్ శాఖల్లో సైతం మార్పులు ఉంటాయని తెలుస్తోంది.

# యూరప్ పరిస్థితి చూస్తే భయమేస్తోంది..



మనదేశంలో యూరప్‌కి ఉన్న క్రేజే వేరు. సమ్మర్ వస్తే యూరప్ ట్రిప్, సినిమా షూటింగులకి యూరప్ ట్రిప్, అంతెందుకు? కూల్‌డ్రింక్ తాగండి యూరప్ ట్రిప్ గెలవండి అంటూ ప్రకటనలను కూడా మనం చూశాం.. కాని ఇప్పుడు అదే యూరప్ కాలుతున్న పెనములా కనిపిస్తోంది. అక్కడ కూడా రికార్డ్ ఉష్ణోగ్రతలు నమోదవుతూ మన తెలంగాణాలోని రామగుండం, కొత్తగూడెం, ఆంధ్రాలోని నెల్లూరు, వైజాగ్ లాంటి ప్రాంతాలను తలపిస్తున్నాయంటే నమ్ముతారా? కాని ముమ్మాటికి ఇది నిజం..

గ్రీస్ తీరం, పారిస్ నగరం, రోమ్ వీధులు, స్పానిష్ రుచులు ఒక్కసారిగా వేడెక్కాయి.. 2026 మే నెలలో పశ్చిమం నుంచి మొదలైన హీట్ వేవ్ కారణంగా మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరిగి జనజీవనాన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఎండతాపానికి రోడ్లు సైతం కరిగిపోయాయి. రైలు పట్టాలు వంకర్లు తిరిగాయి. జనాలు ఇంట్లో నుంచి బయటికి రావాలంటే హడలెత్తిపోయారు. యూరప్ ఖండంలో దాదాపు సగభాగం హీట్ వేవ్ కారణంగా ప్రజలు దారుణమైన పరిస్థితులను చవిచూశారు. అనధికార లెక్కల ప్రకారం ఎండ దెబ్బకి దాదాపు 35 వేల మంది మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

**పెరిగిన మరణాల రేటు**

అత్యధికంగా జర్మనీలో ఏప్రిల్ 6 నుంచి ఆగస్టు 9 వరకు సుమారు 14 వేల మంది మరణించినట్టు జర్మనీ రాబర్ట్ కోచ్ ఇన్‌స్టిట్యూట్ అంచనా వేసింది. సాధారణంగా వేసవి కాలంలో నమోదయ్యే మరణాల కంటే రెండు వేల కంటే తక్కువగా ఉంటాయి. అక్కడ ఈ స్థాయిలో మరణాల రేటు నమోదు కావడం ఇదే తొలిసారి. తర్వాత స్థానంలో ఫ్రాన్స్ ఉంది.

అక్కడ సాధారణం కంటే 7,300 మరణాలు అధికంగా నమోదయ్యాయి. మే చివరి నుంచి జూలై 22 వరకు ఇంకా పూర్తి స్థాయిలో మరణాలను లెక్కించాల్సి ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. తర్వాత స్పెయిన్‌లో 4,947 మరణాలు సంభవించాయి. ఆ తర్వాత ఇంగ్లండ్‌లో 2,877, బెల్జియంలో 1,222, పోలాండ్‌లో 1,070, నెదర్లాండ్స్‌లో సుమారు 900 వరకు మరణాలు సంభవించాయని గణాంకాలు చెబుతున్నాయి.

**తగ్గిన పర్యాటకం**

మన భారతీయులకు యూరప్ ట్రిప్ అంటే యమ క్రేజ్. ఉద్యోగ నిమిత్తం, వ్యాపార నిమిత్తం ప్రయాణించే వారి కంటే విహారం కోసం వెళ్లే వారే ఎక్కువ. 2024లో భారతదేశం నుంచి దాదాపు 38 లక్షల మంది యూరప్‌కి వెళ్లగా, 2025లో ఆ సంఖ్య 40 లక్షలకు చేరుకుంది. కాని యూరప్‌లో మారిన వాతావరణం దృష్ట్యా ఈ ఏడాది మాత్రం ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. రోజుకో ఏఐ టూల్ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది. దినదినాభివృద్ధి చెందుతున్న మానవ మేధస్సు ప్రకృతి ప్రకోపానికి మాత్రం సరైన జవాబు ఇవ్వలేకపోతోందనడానికి ఇదో ఉదాహరణ.

**మునుపెన్నడూ లేనంతగా..**

జూన్ 23న ఫ్రాన్స్‌లోని పిస్సోస్‌లో 44.3 డిగ్రీలు నమోదయ్యాయి. 1947 తర్వాత ఇదే ఆ దేశంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత. ఇక జర్మనీలో అయితే జూన్ చివరలో 46 ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. సాధారణ వేసవితో పోలిస్తే ఇది దాదాపుగా రెట్టింపు. పారిస్, బెర్లిన్ నగరాలలో సాధారణం 23 డిగ్రీలు కాగా, ఈ ఏడాది 40కి చేరుకుంది. అలాగే ప్రాగ్, వియన్నా, మాడ్రిడ్, డబ్లిన్, బుకారెస్ట్ నగరాలలో సాధారణం కంటే 10 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.

**కారణమేంటి?**

భూతాపం పెరగడం, వాతావరణంలోని మార్పులు, పశ్చిమం నుంచి వచ్చిన వడగాల్పులు, కర్బన ఉద్గారాల వల్ల ఈ పరిస్థితి నెలకొంది. మేలో వచ్చిన వడగాల్పులు అధిక పీడన ప్రభావంతో ఎండ తీవ్రత ఒక్కచోట కేంద్రీకృతం కావడం వల్ల యూరప్ ఉక్కపోతతో అల్లాడింది.

## ఇకపై 28 జిల్లా పరిషత్‌లు




**అమరావతి:** ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొనసాగుతున్న 13 జిల్లా పరిషత్ (జెడ్పీ) లను కొత్త జిల్లాల ప్రాతిపదికన 28 జెడ్పీలుగా పునర్విభజిస్తూ ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పరిషత్‌ల ప్రస్తుత పాలక మండళ్ల పదవీకాలం ఈ నెల 24తో ముగుస్తుంది. మరుసటి రోజు 25వ తేదీ నుంచే కొత్త జెడ్పీలు ఏర్పాటవుతాయి. 2022లో రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన మొదలయింది. అప్పటికి జిల్లా పరిషత్‌ల ఎన్నికలు జరిగి ఏడాది కాలమే కావడంతో సాంకేతిక కారణాలతో అప్పటి ఎన్నికల్లో గెలిచిన పాలకమండళ్ల పదవీ కాలం ముగిసే వరకు ఉమ్మడి జిల్లా పరిషత్‌లు కొనసాగాయి.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 660 మండలాలను కొత్త జిల్లాల ప్రాతిపదికన 28 జిల్లా పరిషత్‌లుగా వర్గీకరించారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ మాత్రం కేవలం నాలుగు మండలాలకే పరిమితమైంది. విశాఖ జిల్లాలో నగర ప్రాంతం కాకుండా గ్రామీణ ప్రాంతాలు భీమునిపట్నం, పెందుర్తి, పద్మనాభం, ఆనందపురం మండలాలే ఉంటాయి. ప్రతి జిల్లా ఒక జిల్లా పరిషత్‌గా ఏర్పాటు చేయాలన్న పంచాయతీరాజ్ శాఖ చట్టం నిబంధనల మేరకు ఆ నాలుగు మండలాలతోనే ప్రత్యేక జిల్లా పరిషత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

కేవలం నాలుగు మండలాల ప్రజలు ఎన్నుకొనే నలుగురు జెడ్పీటీసీ సభ్యులతోనే ఆ జిల్లా పరిషత్ ఉంటుంది. అందులో ఒకరిని జెడ్పీ చైర్మన్‌గా ఎన్నుకొంటారు. అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లా పరిషత్‌లలో 11 మండలాలు చొప్పున ఉన్నాయి. అత్యధికంగా వైఎస్సార్ కడప జిల్లా పరిషత్‌లో 39 మండలాలు ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది.

ప్రతి జిల్లాలోని మండల ప్రజా పరిషత్‌లు జిల్లా ప్రజా పరిషత్‌లో భాగస్వామ్యమై ఉంటాయని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. భవిష్యత్తులో ఏదైనా మండల ప్రజా పరిషత్‌ను పునర్వ్యవస్థీకరించినా, విలీనమైనా లేదా మారినా, దానికి అనుగుణంగా జెడ్పీలో చట్టబద్ధమైన మార్పులు చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొత్తగా ఏర్పాటయ్యే జెడ్పీలలో కార్యకలాపాల నిర్వహణకు జిల్లాకొకరు చొప్పున మొత్తం 15 జెడ్పీ సీఈవో, 15 డిప్యూటీ సీఈవో అదనపు పోస్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

జెడ్పీలో ప్రస్తుతం ఉన్న సిబ్బందిని మండల ప్రజా పరిషత్తుల సంఖ్య, ప్రాంతీయ పరిధి, పనిభారం, అవసరాలకు అనుగుణంగా 28 జెడ్పీలకు వర్గీకరించనున్నట్టు ప్రభుత్వం ఆ ఆదేశాల్లో తెలిపింది.

## లండన్ వీధుల్లోకి డ్రైవర్‌లెస్ టాక్సీ




లండన్ రోడ్డును డ్రైవర్‌లెస్ టాక్సీ పలకరించింది. ఊబర్ యాప్‌లో ఊబర్ ఎక్స్, ఊబర్ ఎలక్ట్రిక్ లేదా ఊబర్ కంఫర్ట్ బుక్ చేసినవారికి ఈ కార్లు అందుబాటులోకి వస్తాయి. అయితే ప్రస్తుతం భద్రత కోసం కారులో ఓ నిపుణుడు ఉంటాడు. పూర్తిగా డ్రైవర్‌లెస్‌గా నడిపేందుకు ఇంకా అనుమతులు రావాల్సి ఉంది. అయినప్పటికీ యుకేలో ప్రయాణికుల కోసం మొదలైన తొలి డ్రైవర్‌లెస్ టాక్సీ సర్వీస్ ఇదే...!

**గేమ్ ఛేంజర్** : గేమింగ్ ఇండస్ట్రీలో సరికొత్త సంచలనం మార్కెట్లోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 3.5 బిలియన్ల జనాభా గేమ్స్ ఆడుతారని అంచనా. మరి వారి కోసం ఎప్పటికప్పుడు టెక్ గ్యాడ్జెట్స్ మారుతూ ఉండాలిగా? అందుకే ప్రముఖ ల్యాప్‌టాప్ తయారీ సంస్థ ఏసర్ ఓ గ్యాడ్జెట్‌ను తీసుకొచ్చింది. ప్రాజెక్ట్ డ్యుయల్ ప్లే మిని'గా పిలిచే ఈ డివైస్‌లో 8 అంగుళాల తెర ఉంటుంది. రెండు వైపులా చివరన గేమింగ్ కన్సోల్ ఉంటుంది. కాని ఆసక్తికరమైన విషయం ఏంటంటే టైల్స్ రూపంలో మడతపెట్టి ఉన్న ఈ గ్యాడ్జెట్‌ని అన్‌ఫోల్డ్ చేయగానే కీ ప్యాడ్ కనిపిస్తుంది. స్క్రీన్ రివర్స్ చేస్తే దాన్నే ల్యాప్‌ట్యాప్‌గానూ, చిన్నసైజు పీసీలా ఉపయోగించుకోవచ్చు. ఆకర్షణీయంగా ఉన్న ఈ డ్యూయల్ ప్లే మిని తాలూకు ప్రోటోటైప్‌ను ఐఎఫ్ఏ 2026లో ప్రదర్శనకు ఉంచగా గేమింగ్ ప్రియులు తెగ ఆసక్తిగా చూస్తున్నారు.

## కాంగ్రెస్‌లో కీలక మార్పులు.. పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జ్‌లు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ పలు రాష్ట్రాల సంస్థాగత బాధ్యతల్లో కీలక మార్పులు చేసింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా పీవీ మోహన్, మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా సిరివెళ్ల ప్రసాద్, పంజాబ్ ఇన్‌చార్జ్‌గా సచిన్ పైలట్, అస్సాం ఇన్‌చార్జ్‌గా భూపేష్ బఘేల్, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్‌గా సుఖ్‌దేవ్ భగత్ నియమితులయ్యారు. పంజాబ్‌లో భూపేష్ బఘేల్ స్థానంలో సచిన్ పైలట్‌ను నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సచిన్ పైలట్ రాజస్థాన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత. కేంద్ర మంత్రిగా, రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆయనకు తాజాగా పంజాబ్ బాధ్యతలు అప్పగించారు. భూపేష్ బఘేల్ ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పంజాబ్ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన ఆయనకు తాజాగా అస్సాం బాధ్యతలు అప్పగించారు. 2026 అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ పరిశీలకుడిగానూ వ్యవహరించారు. పీవీ మోహన్ కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత. AICCలో కీలక సంస్థాగత బాధ్యతలు నిర్వహించారు. గతంలో కేరళ, లక్షద్వీప్ వ్యవహారాల బాధ్యతలు చూశారు. సిరివెళ్ల ప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కాగా, AICC కార్యదర్శిగా జార్ఖండ్ వ్యవహారాల్లో పనిచేశారు. సుఖ్‌దేవ్ భగత్ ఝార్ఖండ్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత. గతంలో లోక్‌సభ సభ్యుడిగా, ఝార్ఖండ్ పీసీసీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా పనిచేశారు. తాజా మార్పుల్లో ఆయనకు ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పులతో ఆయా రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత వ్యవహారాలను బలోపేతం చేయడంతో పాటు, స్థానిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కొత్త నాయకత్వాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దించినట్లైంది.

# జెడ్పీ పీఠంపై 'వారసత్వ' పోరు!

- ఇద్దరు టాప్ లీడర్ల వారసుల మధ్య హోరాహోరీకి రంగం సిద్ధం?
- బొత్స కుమార్తె అనూష.. కళా వెంకటరావు వారసుడు రామ్‌మల్లిక్ నాయుడు
- చీపురుపల్లి కేంద్రంగా మళ్లీ బొత్స వర్సెస్ కిమిడి ఫైట్





**విజయనగరం: విజయనగరం జిల్లా పరిషత్ పీఠం చుట్టూ జిల్లా రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఒకప్పుడు ప్రత్యక్ష రాజకీయ ప్రత్యర్థులుగా తలపడిన ఇద్దరు సీనియర్ నేతలు.. ఇప్పుడు తమ రాజకీయ వారసులను జెడ్పీ పీఠంపై కూర్చోబెట్టేందుకు పావులు కదుపుతున్నారన్న చర్చ జిల్లాలో ఆసక్తి రేపుతోంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఒకవైపు.. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు మరోవైపు.. తమ వారసుల రాజకీయ భవిష్యత్తుకు జెడ్పీని వేదికగా చేసుకోవాలని చూస్తున్నట్లు సమాచారం.**

జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్ పదవితో పాటు విజయనగరం మేయర్ పీఠం కూడా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య చర్చకు వస్తోంది. మేయర్ పదవిని టీడీపీ తీసుకుంటే.. జెడ్పీ పీఠాన్ని తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ పరిణామాల మధ్య జెడ్పీ పీఠం ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

### కళా వ్యూహం.. వారసుడికి జెడ్పీ పీఠం?

టీడీపీ సీనియర్ నేత కళా వెంకటరావు తన రాజకీయ వారసుడు రామ్‌మల్లిక్ నాయుడిని స్థానిక రాజకీయాల్లో బలంగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. జెడ్పీ చైర్‌పర్సన్ పదవి దక్కితే.. రాజకీయ అరంగేట్రానికే మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన వర్గం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం తమకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్న టీడీపీ వర్గాలు.. సరైన రిజర్వేషన్ వస్తే చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని ఏదైనా మండలం నుంచి రామ్‌మల్లిక్ నాయుడిని జెడ్పీటీసీగా బరిలోకి దింపే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

### బొత్స 'వారసత్వ' వ్యూహం కూడా అదే!

ఇక బొత్స సత్యనారాయణ కుటుంబం సైతం జెడ్పీ పీఠంపై కన్నేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బొత్స తన కుమార్తె అనూషను రాజకీయ వారసురాలిగా ముందుకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అనూష చీపురుపల్లి నియోజకవర్గంలో రాజకీయంగా చురుగ్గా వ్యవహరిసు ్తన్నారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు సమాచారం. విజయనగరం జెడ్పీలో గతంలో బొత్స కుటుంబానికి ఉన్న రాజకీయ ఆధిపత్యం కూడా ఈసారి వారి వ్యూహానికి బలం ఇస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఒకే నియోజకవర్గం.. ఒకే టార్గెట్!

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇద్దరు నేతల వారసులు కూడా చీపురుపల్లి నియోజకవర్గం నుంచే జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గుర్ల, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో రిజర్వేషన్ తమకు అనుకూలంగా వచ్చే మండలాన్ని ఎంచుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి బొత్స సత్యనారాయణపై కిమిడి కళా వెంకటరావు విజయం సాధించారు. ఇప్పుడు అదే ఇద్దరు ప్రత్యర్థుల వారసులు స్థానిక ఎన్నికల బరిలోకి దిగితే.. రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.

### మళ్లీ బొత్స వర్సెస్ కిమిడి!

ఒకప్పుడు ఇద్దరు నేతలు నేరుగా తలపడిన చీపురుపల్లి రాజకీయ పోరు.. ఇప్పుడు వారి వారసుల వంతు కానుందా? అన్న చర్చ మొదలైంది. జెడ్పీటీసీగా గెలుపొంది.. జెడ్పీ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ఇద్దరి వారసులు బరిలోకి దిగితే, విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇది మరో ఆసక్తికరమైన 'వారసత్వ పోరు'గా మారే అవకాశం ఉంది. ఒక తండ్రి గెలిచాడు.. మరో తండ్రి ఓడాడు. ఇప్పుడు పీఠం కోసం వారి వారసులు తలపడతారా? అన్నది చూడాలి.

# వైఎస్సార్ కష్టానికి చంద్రబాబు రంగులద్దుకుంటున్నారు

- జలయజ్ఞాన్ని వ్యతిరేకించి.. ఇప్పుడు జలం జీవం అంటున్నారు
- 2004లోనే పరిపాలనా అనుమతులు
- రూ.2,680 కోట్లు కేటాయించిన వైఎస్సార్ ప్రభుత్వం
- పోలవరాన్ని జలప్రదాయినిగా గుర్తించింది వైఎస్సారే
- కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి విశేష కృషి
- పురుషోత్తమపట్నం, పుష్కర లిఫ్టులతో గోదావరి జలాలు
- వైఎస్సార్ తవ్వించిన కాలువల్లోనే నేడు నీటి ప్రవాహం
- పారుతున్న ప్రతి నీటిబొట్టు వైఎస్సార్ జలయజ్ఞానికి నిదర్శనం
- చంద్రబాబుపై షర్మిల తీవ్ర విమర్శలు



విజయవాడ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు అందించడంలో చంద్రబాబు తన ఘనతగా చెప్పుకోవడం సరికాద న్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన జలయజ్ఞం ఫలితంగానే నేడు కాలువల్లో గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయని పేర్కొన్నారు. పోలవరాన్ని ఆంధ్రప్రదేశ్ జలప్రదా యినిగా గుర్తించి, ప్రాజెక్టు కోసం కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి వైఎస్సార్ విశేష కృషి చేశారని షర్మిల తెలిపారు. 2004లోనే పరిపాలనా అనుమతులు సాధించి రూ.2,680 కోట్లు కేటాయించారని, భూసేకరణ చేపట్టి 2009 నాటికే ప్రధాన కాలువల పనులను పెద్దమేరకు పూర్తి చేశారని చెప్పారు. జలయజ్ఞాన్ని వ్యతిరేకించిన చంద్రబాబు ఇప్పుడు ఉత్తరాంధ్రపై తనకు ఎంతో ప్రేమ ఉన్నట్లు, సాగు-బాగు తన నినాదమంటూ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాలువలు అవసరం లేదని గతంలో వాదించిన వారే.. వైఎస్సార్ హయాంలో తవ్వించిన కాలువల్లో నీరు ప్రవహిస్తుంటే ఆ క్రెడిట్‌ను తీసుకోవడం సరికాదన్నారు. పురుషోత్తమపట్నం, పుష్కర లిఫ్టుల ద్వారా ఎడమ కాలువలో గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయంటే దానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ చేపట్టిన జలయజ్ఞం కృషే కారణమని షర్మిల పేర్కొన్నారు. కాలువల్లో సైఫన్లు, ఆక్విడక్టులకు సంబంధించిన మైనర్ పనులు చేపట్టి, మొత్తం కాలువ నిర్మాణాన్నే తన ఘనతగా చెప్పుకోవడం తగదన్నారు. "పోలవరం కాలువల కాయకష్టం వైఎస్సార్‌ది.. కలరింగ్ చంద్రబాబుది" అని షర్మిల వ్యాఖ్యానించారు. చంద్రబాబును "అబద్ధాల పురుషోత్తముడు", వైఎస్సార్ కష్టాన్ని కాజేయడంలో "ఉత్తమరత్న" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర జలస్వప్నం సాకారం

**అనకాపల్లి/కోటబొమ్మాళి** : ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల జలస్వప్నం సాకారమవుతున్న వేళ.. గోదావరి జలాలు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకా పల్లి జిల్లాకు చేరుకోవడంపై రాష్ట్ర వ్యవసా యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణతోనే గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకాయని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గోదావరి జలాల రాక కల సాకారమైందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురైన క్లిష్టమైన ఇంజినీరింగ్ సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అధిగమించి.. కాలువ నిర్మాణ పనులను రికార్డు వేగంతో పూర్తి చేసిందని తెలిపారు. పాయకరావుపేట వద్ద రెగ్యులేటర్ ఆన్ చేసి రైతులకు సాగునీటిని విడుదల చేయడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.

**సిక్కోలు వరకు రావాలి** : పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు చేరడం తొలి అడుగేనని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రానున్న రోజుల్లో ఈ జలాలు విజయనగరం మీదుగా శ్రీకాకుళం జిల్లాలోని చివరి ఆయకట్టు ప్రాంతాలకు చేరాలని ఆకాంక్షించారు. సిక్కోలు నేలను సస్యశ్యామలం చేసే గోదావరి జలాల కోసం ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ఉత్తరాంధ్రలో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**23.44 టీఎంసీల నీరు** : చంద్రబాబు దూరదృష్టి, పట్టుదలతో శరవేగంగా పూర్తయిన ఈ ప్రాజెక్టు ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు సాగు, తాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాలకు 23.44 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఇది కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని.. ఉత్తరాంధ్ర వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి కొత్త మార్గాలను తెరిచే కీలక ప్రాజెక్టు అని పేర్కొన్నారు.

**అధికారులకు అభినందనలు** : రెండేళ్లలో కాలువ తవ్వకం, క్లిష్టమైన అక్విడక్ట్ నిర్మాణం తదితర కీలక పనులను రికార్డు వేగంతో పూర్తి చేసిన ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకిన ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని అచ్చెన్నాయుడు అన్నారు. ఉత్తరాంధ్రను సుజల సస్యశ్యామలం చేయాలన్న



చంద్రబాబు సంకల్పానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. అనకాపల్లితో ప్రారంభమైన ఈ జలయాత్ర శ్రీకాకుళం జిల్లా చివరి ఆయకట్టు వరకు కొనసాగాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఉత్తరాంధ్రకు గోదారమ్మ రాక..
# జల సిరులతో కొత్త కళ

- బీడు భూములకు గోదావరి జలాల పరవళ్లు..
- పోలవరం ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్ర వైపు పరుగులు

విశాఖపట్నం : ఎక్కడ గోదావరి.. ఎక్కడ ఉత్తరాంధ్ర! మధ్యలో తూర్పు కనుమలు.. అడవులు.. నదులు.. కొండలు.. ఎన్నో అడ్డంకులు. అయినా దశాబ్దాల కల సాకారం అయ్యింది. గోదారమ్మ ఉత్తరాంధ్ర గడ్డపై అడుగు పెట్టింది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించే ప్రక్రియ సెప్టెంబర్ 2న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగింది. పాయకరావుపేట వద్ద గోదావరి జలాలను అనకాపల్లి వైపు పంపించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్రలోకి ప్రవేశించడం వల్ల బీడు భూములకు కొత్త జీవం వస్తుంది. ఎండిన చెరువులు జలకళను సంతరించుకోనున్నాయి. సాగుకు నీరు అందడంతో పంట పొలాలు పచ్చని పైరులతో కళకళలాడనున్నాయి. తాగునీటి కష్టాలు తీరడంతో పాటు పారిశ్రామిక అవసరాలకు కూడా నీటి లభ్యత పెరగనుంది.



## నాలుగు నదులను దాటుకుని..

పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర వైపు పరుగులు తీస్తున్నాయి. మార్గమధ్యలో పంపా, తాండవ, వరాహ, శారద నదులను దాటుకుంటూ.. తూర్పు కనుమలలోని సంక్లిష్ట ప్రాంతాలను అధిగమిస్తూ ఈ జలాలు ముందుకు సాగుతున్నాయి. వివిధ నదీ ప్రవాహాలను దాటేందుకు పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా అక్విడెక్టులు, సైఫన్లను నిర్మించారు. పంపా నదిపై భారీ అక్విడెక్ట్ నిర్మించి గోదావరి జలాలకు మార్గం సుగమం చేశారు. 30 మీటర్ల లోతు వరకు 312 పైల్స్‌తో పునాదులు వేసి ఈ నిర్మాణాన్ని చేపట్టారు. తాండవ నదిపై 6 వెంట్లతో 447 మీటర్ల పొడవున అక్విడెక్ట్ నిర్మించగా.. ఇది 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకునేలా నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు.

## సైఫన్‌తో మరో సవాల్‌కు పరిష్కారం

ఏలేరు నది బెడ్ లెవల్‌కు దిగువన గోదావరి జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణాన్ని చేపట్టారు. ఇలాంటి క్లిష్టమైన నిర్మాణాలను అధిగమిస్తూ గోదావరి జలాలను ఉత్తరాంధ్రలోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టులో కీలక ఘట్టంగా నిలిచింది. ప్రస్తుతం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసే గోదావరి జలాలతో అనకాపల్లి జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలోని ఏలేరు కాలువతో పాటు 110 చెరువులను నింపేలా జలవనరుల శాఖ ప్రణాళిక రూపొందించింది. పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరాహ, మామిడిగెడ్డ ఆయకట్టు పరిధిలోని 46,620 ఎకరాలకు ఈ జలాలతో ప్రయోజనం కలగనుంది.

## 23.44 టీఎంసీల జలాల వినియోగం

పోలవరం ఎడమ ప్రధాన కాలువను ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానించి మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలను సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం సుమారు 213 కిలోమీటర్ల పొడవున పోలవరం ఎడమ ప్రధాన కాలువను నిర్మించారు.

## లక్ష్యం.. 8 లక్షల ఎకరాలకు సాగునీరు

గోదావరి జలాలను ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం చేయడం ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎగువ ప్రాంతాలకు నీటిని తరలించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ మొత్తం వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్రలో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందించేందుకు మార్గం సుగమం కానుంది. రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల.. ఇప్పుడు సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకిన రోజు.. ఈ ప్రాంత సాగునీటి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ముఖ్యంగా అనకాపల్లి ప్రాంతానికి సెప్టెంబర్ 2 ఒక చారిత్రక రోజుగా మిగిలిపోతుంది.



# గతంలో ఇదే 26వ తేదీతో విపత్తులు

**సుమారు 96 ఏళ్లు అవుతోంది.. 26వ తేదీ ప్రకృతి విపత్తులు సంభవించడమనే ఆశ్చర్యకరమైన ఘటనలు చోటు చేసుకోవడం. 1930లో టర్కీని కుదిపేసి 32,700 మంది ప్రాణాలు తీసిన భూకంపం సంభవించింది నవంబరు 26. ఆ తరువాత కూడా అనేకసార్లు నెలలు మారినా విపత్తులు మాత్రం 26వ తేదీనే జరగడం యాదృచ్?ఛకం అని కొట్టిపారేయలేమేమో. ప్రకృతి వైపరీత్యాల మాట అలా ఉంటే మానవ తప్పిదాల కారణంగా చోటు చేసుకున్న భారీ దుర్ఘటనల్లో కొన్ని కూడా 26వ తేదీనే చోటు చేసుకున్నాయి. మచ్చుకు కొన్నింటిని చూద్దాం.**

**ఆగస్టు 26, 2026:** నేపాల్‌ను ముంచేసిన మెరుపు వరదలు: హిమాలయ పర్వత శిఖరాల్లో ఓ హిమానీనదం అకస్మాత్తుగా విరిగి కిందకు పడటంతో నేపాల్‌లోని రసువా జిల్లాలో భోటే కోశి నదికి మెరుపు వరద వచ్చింది. దీంతో గ్రామాలు మునిగాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. ఆగస్టు 31 నాటికి 900 మందికి పైగా మృతి చెందారు. దాదాపు 4,500 మంది గల్లంతయ్యారు.

**అక్టోబర్ 26, 2015:** హిందూకుష్ భూకంపం: హిందూకుష్ ప్రాంతంలో 7.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. భారతదేశం సహా అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఉత్తర కొన్ని ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. దాదాపు 400 మంది మరణించారు.

**మే 26, 2006:** యోగ్యకర్త భూకంపం, ఇండోనేసియా: ఇండోనేయాలోని జావా ద్వీపంలో యోగ్యకర్త సమీపంలో 6.3 తీవ్రతతో భూకంపం వచ్చింది. వేల ఇళ్లు, భవనాలు ధ్వంసమయ్యాయి. 5,700 మందికి పైగా మృతి చెందారు.

**జూలై 26, 2005:** మహారాష్ట్ర వరదలు: మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తాయి. రాజధాని ముంబైలో ఒకే ఒక్కరోజులో 944 మి.మీ. వర్షం నమోదైంది. రోడ్లు, ఇళ్లు, రైల్వే లైన్లు నీట మునిగాయి. జనజీవనం స్తంభించింది. రాష్ట్రం మొత్తమ్మీద 1,094 మంది మృతి చెందారు.

**డిసెంబర్ 26, 2004: సునామీ ప్రళయం...**

సుమత్రా తీరం సమీపంలో 9.1 తీవ్రతతో వచ్చిన భూకంపం సునామీగా మారి హిందూ మహాసముద్ర తీర దేశాలపై విరుచుకు పడింది. ఇండోనేసియా, శ్రీలంక, భారతదేశం, థాయిలాండ్ తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దాదాపు 2,28,000 మంది మరణించగా మరెందరో గల్లంతయ్యారు. చరిత్రలోనే అత్యంత ప్రాణాంతక విపత్తుల్లో ఒకటిగా ఇది నమోదైంది.

**డిసెంబర్ 26, 2003:** బామ్ భూకంపం, ఇరాన్: ఇరాన్‌లో 6.6 తీవ్రతతో వచ్చిన భూకంపం చారిత్రక నగరం బామ్, చుట్టుపక్కల గ్రామాలను ధ్వంసం చేసింది. వేల భవనాలు మట్టిదిబ్బలుగా మారాయి. ఈ ప్రకృతి విపత్తులో సుమారు 31,000 మంది ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**మార్చి 25-26, 2002:** వరుస భూకంపాలతో అఫ్గానిస్తాన్ అతలాకుతలం: ఉత్తర అఫ్గానిస్తాన్‌లోని బఘ్లాన్ ప్రాంతంలో రాత్రిపూట వరుస భూకంపాలు సంభవించి 1800 మంది ప్రాణాలు బలితీసుకున్నాయి. మట్టి ఇళ్లు కూలిపోగా వేల మంది నిరాశ్రయులయ్యారు.

**జనవరి 26, 2001:** గుజరాత్ భూకంపం: 2001 జనవరి 26న గుజరాత్‌లో భయంకర భూకంపం సంభవించింది. ఫలితంగా కచ్ ప్రాంతం ధ్వంసమైంది. సుమారు 20,000 మంది ప్రాణాలు



కోల్పోగా... 1,66,000 మందికి పైగా గాయపడ్డారు.

**జూలై 26, 1963:** స్కోప్జే భూకంపం: అప్పటి యుగోస్లేవియాలోని స్కోప్జే నగరంలో 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. నగరం ధ్వంసమైంది. 2,00,000 మంది నిరాశ్రయులయ్యారు. 1,070 మంది మృతి చెందారు.

**నవంబర్ 26, 1943:** లాడిక్ భూకంపం, టర్కీ: టర్కీలోని లాడిక్-సామ్‌సన్-హవ్జా ప్రాంతంలో 7.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. టర్కీ ఉత్తర ప్రాంతంలో విస్తృత నష్టం జరిగింది. 4,020 మంది మృతి చెందారు.

**డిసెంబర్ 26-27, 1939:** ఎర్జింకాన్ భూకంపం, టర్కీ: టర?ికలోని ఎర్జింకాన్ ప్రాంతంలో 7.8 తీవ్రతతో వచ్చిన భూకంపం 32,700 మంది ప్రాణాలు బలితీసుకుంది. అపారమైన ఆస్తినష్టం నమోదైంది.

**మానవ తప్పిదాలు తెచ్చిన విపత్తులు...**

**సెప్టెంబర్ 26, 2023: ఖరాఖోష్ వెడ్డింగ్ హాల్ అగ్నిప్రమాదం...**

ఇరాక్‌లోని మోసుల్ సమీపంలోని ఖరాఖోష్‌లోని వెడ్డింగ్ హాల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. భవనం లోపలే పటాకులు పేల్చడంతో ఈ ప్రమాదం జరిగింది. పైరోటెక్నిక్స్ మండే పదార్థాలను తగలబెట్టాయి. నిండిన హాల్‌లో నిప్పు వేగంగా వ్యాపించింది. 100 మందికి పైగా మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.

**ఆగస్టు 26, 2021: కాబూల్ ఎయిర్‌పోర్ట్ బాంబు పేలుడు**

అఫ్గానిస్తాన్‌లోని కాబూల్‌లోని హమీద్ కర్జాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 183 మంది మృతి చెందారు. వీరిలో 170 మంది ఆఫ్గాన్ పౌరులు, 13 మంది అమెరికా సైనికులు ఉన్నారు.

**నవంబర్ 26, 2008: ముంబై ఉగ్రదాడులు**

దేశాన్ని కుదిపేసిన అత్యంత భారీ ఉగ్రవాద దాడి ఇది. 2008 నవంబర్ 26 రాత్రి ముంబైలోకి ప్రవేశించిన పది మంది లష్కర్--ఎ--తొయిబా ఉగ్రవాదులు ఏకకాలంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర?మనస్, తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ వంటి ప్రాంతాల్లో కాల్పులకు దిగారు. మూడు రోజుల పాటు సాగిన ఈ ఉగ్రదాడిలో భద్రతాదళాలు తొమ్మిది మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. 166 మంది మృతి చెందారు. 300 మందికి పైగా గాయపడ్డారు.

**మే 26, 1991: లాడా ఎయిర్ ఫ్లైట్ 004 ప్రమాదం**

బ్యాంకాక్ నుంచి వియన్నాకు వెళ్తున్న లాడా ఎయిర్ బోయింగ్ 767 విమానం థాయిలాండ్‌లో కూలిపోయింది. ఇంజన్ థ్రస్ట్ రివర్సర్ అనూహ్యంగా విచ్చుకోవడంతో విమానం నియంత్రణ కోల్పోయి ముక్కలైపోయి కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న 223 మంది మృతి చెందారు.

# దేశంలో చాలా చోట్ల పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు..

దేశంలో అనేక చోట్ల హెచ్1ఎన్1 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపించినప్పుడు రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్లకుండా, ఇతరులతో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ వైరస్ వల్ల వచ్చే సమస్యలకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నమోదవుతున్న ఇన్‌ఫ్లుయెంజా కేసుల్లో సుమారు 70 శాతం హెచ్1ఎన్1 కేసులు ఉన్నట్లు నిపుణులు తెలిపారు. సాధారణంగా స్వైన్ ఫ్లూగా పిలిచే హెచ్1ఎన్1 వైరస్ ప్రస్తుతం చిన్నారుల్లో, ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లల్లో ఎక్కువ ఇబ్బందులను కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్లలోపు పిల్లల్లో అధిక జ్వరం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు.

**ఎలాంటి లక్షణాలు ఉంటాయి..**

అంతర్లీన ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లల్లో ఇన్‌ఫ్లుయెంజా తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రెండేళ్లలోపు పిల్లలు తినడం, తాగడం మానేయడం, 103 నుంచి 104 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు అధిక జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే ప్రత్యేక శ్రద్ధ అవసరం. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న వైరస్‌లో వచ్చిన మార్పును యాంటీజెనిక్ డ్రిఫ్ట్‌గా పేర్కొంటున్నారు. ఇది 2009లో కనిపించిన వైరస్ మార్పు తరహాలో పెద్ద స్థాయిలో వచ్చిన యాంటీజెనిక్ షిఫ్ట్ కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత ఇన్‌ఫ్లుయెంజా వైరస్ లక్షణాల్లో తీవ్రమైన ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం ప్రధానంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 103 నుంచి 104 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు జ్వరం ఉండటం ఈ వైరస్ సంక్రమణలో గమనించాల్సిన ముఖ్యమైన లక్షణంగా చెబుతున్నారు. కోవిడ్-19 లేదా ఇతర వైరల్ ఇన్‌ఫెక్షన్లతో పోల్చినప్పుడు ప్రస్తుత హెచ్1ఎన్1 ఇన్‌ఫ్లుయెంజాలో ఈ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని నిపుణులు పేర్కొన్నారు.

**ఎవరికి రిస్క్ ఎక్కువ..** పిల్లలతో పాటు వృద్ధులు, గర్భిణీలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు కూడా హెచ్1ఎన్1 వల్ల వచ్చే సమస్యలకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది. మధుమేహం, గుండె, మూత్రపిండాలు, కాలేయ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, ఆస్తమా, సీవోపీడీ వంటి శ్వాసకోశ సమస్యలు ఉన్నవారిలో ఇన్‌ఫ్లుయెంజా న్యూమోనియా వంటి తీవ్రమైన



సమస్యలకు దారితీసే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఇన్‌ఫ్లుయెంజా సోకినవారు 7 నుంచి 10 రోజుల్లో కోలుకునే అవకాశం ఉంటుంది. అయితే అధిక ప్రమాదం ఉన్న వర్గాలకు చెందినవారు లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది. ముఖ్యంగా అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తినడం లేదా తాగడం మానేయడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.

**యాంటీ వైరల్ మందులనే వాడాలి..**

హెచ్1ఎన్1 వంటి ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌కు యాంటీబయాటిక్స్ పనిచేయవు. ఇవి బ్యాక్టీరియా వల్ల కలిగే ఇన్‌ఫెక్షన్ల చికిత్సకు ఉపయోగపడతాయి. ఇన్‌ఫ్లుయెంజా చికిత్సలో యాంటీవైరల్ మందులను వైద్యులు సూచించినవే వాడాలి. ముఖ్యంగా వైరస్ సంక్రమణ ప్రారంభ దశలోనే సరైన చికిత్స తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. అయితే మందులను స్వయంగా తీసుకోకుండా వైద్యుల సూచన మేరకు మాత్రమే ఉపయోగించాలి. హెచ్1ఎన్1 వ్యాప్తిని తగ్గించేందుకు కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించడం అవసరం. ప్రతి ఏడాది ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ తీసుకోవడం, చేతులను తరచూ శుభ్రంగా కడుక్కోవడం, జ్వరం లేదా ఇతర లక్షణాలు ఉన్నప్పుడు రద్దీ ప్రదేశాలకు దూరంగా ఉండటం, అవసరమైన సందర్భాల్లో మాస్క్ ధరించడం వంటి చర్యలు వైరస్ వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం కూడా శరీర రోగనిరోధక శక్తిని కాపాడుకోవడంలో ఉపయోగపడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

# బ్రహ్మోత్సవాల నాటికి సివిల్ ఇంజినీరింగ్ పనులను పూర్తి చేయాలి



**తిరుమల** : బ్రహ్మోత్సవాల నాటికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సివిల్ ఇంజినీరింగ్ పనులన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి ఆదేశించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుమలలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల పురోగతిపై ఆయన మంగళవారం తిరుమలలోని సుధర్మ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో సివిల్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ తదితర విభాగాలకు సంబంధించిన పనుల పురోగతిని పరిశీలించారు.టీటీడీ ఇన్‌చార్జి సీఈ మనోహరం, ఇంజినీరింగ్ పనుల పురోగతిని అదనపు ఈవోకు వివరించారు.

శ్రీవారి ఆలయం, మాడ వీధులు, గ్యాలరీల్లో వైట్‌వాషింగ్, పెయింటింగ్, బారికేడింగ్, మరమ్మతులు, అభివృద్ధి పనులు, పుష్కరిణి గ్రిల్స్ పునరుద్ధరణ, వాహనాల ఫిట్‌నెస్, వివిధ డ్యామ్‌లలో నీటి నిల్వల స్థాయి, విద్యుత్ అలంకరణ, వివిధ విశ్రాంతి భవనాల్లో ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ తదితర పనులు దాదాపు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఈలు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, ఈఈలు శ్రీనివాసులు, సుధాకర్, డీఈ చంద్రశేఖర్ తదితర ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ‘పాలు, పెరుగు అమ్మినట్టు టీచర్ ఉద్యోగాలు అమ్మేశారు’

**తూర్పుగోదావరి జిల్లా:** డీఎస్సీలో అక్రమాలు గురించి గతం నుంచి చెబుతూనే వచ్చామని.. మూడున్నర లక్షల మంది అభ్యర్థులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నైతిక బాధ్యత వహించాలన్న ఆలోచన మాత్రం ప్రభుత్వానికి రావటం లేదన్నారు. డీఎస్సీలో అక్రమాలపై ప్రభుత్వం ప్రజలకు సంజాయిషి చెప్పాలని డిమాండ్ చేశారు.

“దేశ చరిత్రలో కానీ విని ఎరుగని రీతిలో గత ప్రభుత్వ హయాంలో ఒకటిన్నర లక్షల ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ నిర్వహించాం. హెరిటజ్‌లో పాలు, పెరుగు అమ్మినట్టు రాష్ట్రంలో టీచర్ ఉద్యోగాలు అమ్మేశారు. లోకేష్ విద్యాశాఖ మంత్రిగా రావటం విద్యార్థులకు శాపం. టెట్‌కి, డీఎస్సీకి ఒకరినే కన్వీనర్‌గా పెట్టడం దగ్గర నుంచి.. సంతలో బర్రెలు అమ్మినట్టు టీడీపీ నేతలు ఉద్యోగాలు అమ్మేసేంతవరకు ప్రతి విషయాన్ని ప్రజలకు వివరించాం. మీకు చిత్తశుద్ధి ఉంటే సీబిఐ విచారణ జరిపించండి” అని జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు.

కుల విద్వేషాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయంగా లాభం పొందే ప్రయత్నం చేస్తున్నారు. లోకేష్ వ్యవహారంపై ఎందుకు సీబిఐ విచారణ జరపటం లేదు. సీబీఐ విచారణ జరిపితే వాస్తవాలు బయటికి వస్తాయి. యువగళం పాదయాత్రలో పాల్గొన్న వారిలో ఎవరెవరికి ఉద్యోగాలు ఇచ్చారో బయట పడుతుంది. ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని ఉద్దేశంతోనే ధైర్యం చేయడం లేదు. కనీసం గ్రౌండ్‌లో అడుగుపెట్టని వారికి సైతం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చేశారు.. డబ్బు కోసం అక్రమ సంపాదన కోసం ఎటువంటి నీచమైన పని చేయడానికైనా ప్రభుత్వం దిగజారి పోతుంది. ఆడియో టేపులు బయటకు వచ్చినా ప్రభుత్వంలో స్పందన ఉండటం లేదు.

డీఎస్సీ వ్యవహారంలో ఎందుకు ఒక్కరిపై కూడా కేసు నమోదు చేయలేకపోయారు. సోషల్ మీడియా హ్యాండిల్స్ నిలుపు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్ సర్వీసెస్ పరీక్షలపై మీరు చేసిన ఆరోపణలపై, ప్రస్తుత డీఎస్సీపై సిబీఐ విచారణకు ఆదేశాలు ఇవ్వండి. మీరు చేసిన తప్పుడు నియామకాలు బయటపడతాయి. సాక్ష్యాలు ఉన్నా ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించడం దారుణం. లోకేష్ మంత్రిగా కొనసాగేందుకు అర్హత లేదు. తక్షణమే లోకేష్ రాజీనామా చేయాలి. ఈ వ్యవహారంలో కోర్టులు కూడా జోక్యం కల్పించుకోవాలి” అని జక్కంపూడి రాజా పేర్కొన్నారు.





# బొత్సపై 'జనసేన' ప్రచారం

# టీడీపీ మైండ్ గేమా?

- వైసీపీని బలహీనపర్చేందుకు సోషల్ మీడియాలో కొత్త స్కెచ్?
- బొత్స పార్టీ మారుతున్నారంటూ యూట్యూబ్ ఛానళ్లలో వరుస కథనాలు..
- ప్రచారాన్ని ఖండించిన బొత్స
- ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కొత్త మైండ్‌గేమ్..
- బొత్సే టార్గెట్ ఎందుకు?
- బొత్సను కదిలించలేక.. కథనాలతో కదిలించే ప్రయత్నమా?

విశాఖపట్నం: వైసీపీని రాజకీయంగా దెబ్బతీయడానికి మరో మైండ్‌గేమ్ మొదలైందా..? సీనియర్ నేత బొత్స సత్యనారాయణ జనసేనలోకి వెళ్తున్నారంటూ సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లలో హోరెత్తుతున్న ప్రచారం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. బొత్స పార్టీ మార్పును ఖండిస్తున్నప్పటికీ అదే ప్రచారాన్ని పదేపదే తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ వ్యూహం ఉందా అన్న చర్చ మొదలైంది. నేతను పార్టీలోకి లాగడం కంటే.. ఆయన పార్టీ మారుతున్నారనే భావనను ప్రజల్లోకి నాటడమే అసలు టార్గెటా? టీడీపీ అనుకూల రాజకీయ వర్గాల మైండ్‌గేమ్‌లో భాగంగానే ఈ ప్రచారం సాగుతోందని వైసీపీ వర్గాలు మండిపడుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చుట్టూ జనసేన చేరిక ప్రచారం ఒక్కసారిగా ఊపందుకోవడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. బొత్స త్వరలో జనసేనలో చేరబోతున్నారంటూ పలు సోషల్ మీడియా వేదికలు, యూట్యూబ్ ఛానళ్లు వరుస కథనాలు ప్రసారం చేస్తున్నాయి. అయితే ఈ ప్రచారాన్ని బొత్స స్వయంగా ఖండించిన నేపథ్యంలో.. అసలు ఈ ప్రచారం వెనుక ఎవరి వ్యూహం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

### బొత్సే చెప్పేశారు.. 'మైండ్ గేమ్' అంటూ కొట్టిపారేశారు

తాను పార్టీ మారుతున్నానంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా ఆధారరహితమని బొత్స స్పష్టం చేసినట్లు తాజా కథనాలు వెల్లడిస్తున్నాయి. అయినప్పటికీ ప్రచారం ఆగకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒక సీనియర్ నాయకుడు స్వయం గా ఖండించిన తర్వాత కూడా అదే అంశాన్ని పదేపదే ప్రచారం చేయ డం వెనుక రాజకీయ ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### అసలు టార్గెట్ వైసీపీ క్యాడరా?

బొత్స జనసేనలోకి వెళ్తున్నారన్న ప్రచారం నిజమా కాదా అన్నదాని కంటే.. ఆ ప్రచారం వల్ల వైసీపీపై ఎలాంటి మానసిక ప్రభావం పడుతుందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణకు ఉన్న రాజకీయ ప్రాధాన్యత నేపథ్యంలో.. ఆయన పార్టీ మారుతున్నారనే వార్తలు వైసీపీ శ్రేణుల్లో అనుమానాలు, గందరగోళం సృష్టించే అవకాశం ఉంది. "బొత్స కూడా వెళ్లిపోతున్నారు.. ఇక వైసీపీలో ఎవరు మిగులుతారు?" అనే భావనను క్యాడర్‌లో కలిగించడమే ఈ ప్రచారం వెనుక అసలు ఉద్దేశమా? అన్న చర్చ కూడా వినిపిస్తోంది.

### టీడీపీకి లాభం చేకూర్చే 'పొలిటికల్ నరేటివ్'?

బొత్స జనసేనలో చేరుతున్నారన్న ప్రచారం నిజమైతే దాని రాజకీయ ప్రభావం వైసీపీపై పడుతుంది. కానీ అది కూటమిలోని జనసేన కంటే ముందుగా టీడీపీకి రాజకీయంగా ఉపయోగపడే నరేటివ్గా మారుతుందన్న విశ్లేషణ కూడా ఉంది. వైసీపీకి చెందిన కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారనే భావనను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే.. ప్రతిపక్ష పార్టీపై మానసిక ఒత్తిడి పెంచవచ్చన్నది రాజకీయ వ్యూహంగా చూడవచ్చు. అందుకే దీనిని కొందరు రాజకీయ పరిశీలకులు "మైండ్ గేమ్"గా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ ప్రచారం వెనుక టీడీపీ నేతలే ఉన్నారని నిర్ధారించే ప్రత్యక్ష ఆధారాలు ఇప్పటివరకు బయటకు రాలేదు. కాబట్టి దీనిని నిర్ధారిత నిజంగా కాకుండా రాజకీయ ఆరోపణ, ప్రచార వ్యూహం కోణంలోనే చూడాల్సి ఉంటుంది.

### బొత్సను కదిలించలేక..

ప్రస్తుతం బొత్స శాసన మండలిలో కూటమి ప్రభుత్వంపై విమర్శలు కొనసాగిస్తున్నారు. ఇటీవల కూడా డీఎస్సీ, నిరుద్యోగ సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాంటి సమయంలో ఆయన జనసేనలోకి వెళ్తున్నారంటూ ప్రచారం ఊపందుకోవడం రాజకీయంగా ఆసక్తికర పరిణామమే. నేతను మార్చడం కంటే.. నేతపై ప్రజల్లో అభిప్రాయాన్ని మార్చడం సులభం. అదే రాజకీయ మైండ్ గేమ్‌లో భాగమైతే.. బొత్సపై జరుగుతున్న ప్రచారం ఒక పెద్ద వ్యూహంలో భాగమే కావచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### బొత్స కుమార్తె రాజకీయ ప్రవేశం..

ఇదిలా ఉండగా బొత్స తన కుమార్తె డాక్టర్ అనూషను రాజకీయాల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించడం కూడా ఈ ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. ఆమెను విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి పోటీ చేయించనున్నట్లు బొత్స ప్రకటించినట్లు పలు కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాన్ని ఆధారంగా చేసుకుని.. బొత్స కుటుంబం జనసేన వైపు చూస్తోందంటూ కొన్ని మీడియా కథనాలు ఊహాగానాలు ప్రచురించాయి. అయితే బొత్స కుటుంబం లేదా జనసేన నుంచి దీనిపై అధికారిక ధృవీకరణ మాత్రం వెలువడలేదు. బొత్స పార్టీ మారుతున్నారనే ప్రచారం కొనసాగితే మూడు రకాల రాజకీయ ప్రయోజనాలు కలిగే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. వైసీపీ క్యాడర్‌లో అయోమయం, బొత్స రాజకీయ బలంపై అనుమానాలు. ఉత్తరాంధ్రలో వైసీపీ భవిష్యత్తుపై ప్రతికూల నరేటివ్... అందుకే ఈ ప్రచారం వెనుక అసలు లక్ష్యం "బొత్సను జనసేనలోకి తీసుకెళ్లడమా? లేక బొత్సను జనసేనలోకి వెళ్తున్నట్లు చూపించి వైసీపీని మానసికంగా దెబ్బతీయడమా?" అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

### క్లారిటీ ఒక్కటే..

అన్ని ఊహాగానాలకు తెరపడాలంటే బొత్స సత్యనారాయణ మరోసారి స్పష్టమైన ప్రకటన చేయాల్సిందే. ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా సమాచారం ప్రకారం ఆయన పార్టీ మార్పు విషయాన్ని ఖండించారు. కాబట్టి ఇప్పటికైతే "బొత్స జనసేనలోకి వెళ్తున్నారు" అనేది నిర్ధారిత వార్త కాదు. కానీ ఈ ప్రచారం మాత్రం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కొత్త మైండ్ గేమ్‌కు తెరతీసిందనడంలో సందేహం లేదు. బొత్సను జనసేనలోకి తీసుకెళ్లే వ్యూహమా? లేక బొత్స జనసేనలోకి వెళ్తున్నారనే ప్రచారంతో వైసీపీని మానసికంగా దెబ్బతీసే వ్యూహమా? రాజకీయ తెర వెనుక అసలు స్క్రిప్ట్ ఎవరిదో తేలాల్సి ఉంది.



# వందలాది మందిని కాపాడిన ధీరవనిత..!

పొరుగుదేశమైన నేపాల్‌లో అకస్మిక వరదల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొన్న వారి గుండెధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందే. అలుపన్నదే లేకుండా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కృషి చేసిన వారిలో పైలట్స్ సేవలు ప్రధానమైనవి. వీరిలో 40 ఏళ్ల ప్రియా అధికారి ఒకరు. ఎక్కడచూసినా మేట వేసిన బురద, మృత్యుదిబ్బగా మారిన ప్రాంతంలో ఆమె నేర్పుగా హెలీక్యాప్టర్ నడిపి.. శభాష్ అనిపించుకున్నారు. ఆ దేశ తొలి మహిళా హెలిక్యాప్టర్ కెప్టెన్‌గా చరిత్ర సృష్టించిన ప్రియ పురుషులతో ధీటుగా రెస్క్యూలో పాల్గొంది. విపత్కాలంలో వెనకడుగు వేయకుండా.. వారం రోజుల వ్యవధిలోనే ఏకంగా వందకు పైగా రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న ఆమెను కొనియాడుతున్నారంతా.

నేపాల్ వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ఒకటి. ఈ ప్రాంతంలో సహాయక చర్యల కోసం ఆర్మీ రంగంలోకి దిగింది. నేపాల్ -- టిబెట్ సరిహద్దులో చిక్కుకున్న వందలాది మందిని



హెలీక్యాప్టర్లలో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాదాపు పురుషులే కెప్టెన్లుగా ఉన్న ఈ మిషన్‌లో ప్రియా అధికారి ఒక్కరే మహిళ. నేపాల్ మొదటి మహిళా కెప్టెన్‌గా రికార్డు సాధించిన ప్రియ.. వరద తీవ్రతకు తమకు సైతం సహాయక చర్యల్లో పాల్గొనడం సవాల్ విసిరిందని అంటోంది.

వరద ఉధృతికి అతలాకుతలమైన రసువా జిల్లాలోని తిమురే గ్రామంలో.. దాదాపు ఇరవైకి పైగా హెలిక్యాప్టర్లు ఒకేసారి ల్యాండ్ అయ్యేవి. పైలట్స్ రేడియోలో నిరంతరం మాట్లాడుతూ అక్కడ చిక్కుకున్న వారిని తరలించారు. ఈ భారీ మిషన్‌లో పైలట్స్‌ను సమన్వయం చేసుకుంటూ అలుపెరగకుండా సేవలందించింది ప్రియ. వరద బాధితులతో పాటు.. ఎవరెస్ట్ పర్వతంపై చిక్కుకున్న పర్వతారోహకులను సైతం కాపాడిందీ ధీరవనిత. అందుకోసం ఏకంగా 6,200 మీటర్ల ఎత్తులో హెలీక్యాప్టర్‌ను నడిపింది ప్రియ.

తాజా మిషన్ గురించి మాట్లాడిన ప్రియా.. 'పైలట్స్ నిరంతరం రేడియో ద్వారా సమన్వయం చేసుకునేవాళ్లం. బాధితులను రక్షించేందుకు ఒకేచోట ఏకకాలంలో ఐదారు విమానాలు దిగేవి. తిమురేలో వరదల తీవ్రతకు మంది చనిపోయారు. వందలాది మంది చిక్కుకుపోయారు. మేము దాదాపు రెండొందలకు పైగా మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. వరదల్లో ఐదు హైడ్రోపవర్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. వెయ్యికిపైగా చనిపోయారు. ఇంత విషాదంలోనూ నేను హెలీక్యాప్టర్ ఆపిన చోట జనం కనిపిస్తే హమ్మయ్య వీరినైనా కాపాడగలను అని నా ముఖంలో నవ్వు విరిసేది. వారితో.. మీరు బతికిపోయారు అని చెప్పేదాన్ని. వాళ్లెవరూ నాకు బంధువులు కాదు. కానీ, ఈ మిషన్ సమయంలో బాధితులను తరలిస్తున్నప్పుడు ఎంతో భావోద్వేగానికి లోనయ్యా' అని వెల్లడించింది.

హెలీక్యాప్టర్ కెప్టెన్‌గా ఇప్పుడు ప్రపంచానికి తెలిసిన ప్రియ అనుకోకుండా ఇటువైపు వచ్చింది. బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదివిన ప్రియ ఓసారి హెలీక్యాప్టర్ రైడ్‌కు వెళ్లింది. అంతే.. ఆ క్షణంలోనే పైలట్ అవ్వాలనే కోరిక ఆమెలో బలంగా నాటుకుంది. 'నేను హెలీక్యాప్టర్ పైలట్ అయితే ఎలా ఉంటుంది?' అని ప్రియ కెప్టెన్‌ను అడిగింది. నాలుగు నెలల్లోనే ఫిలీప్పిన్స్ వెళ్లి పైలట్ శిక్షణ తీసుకుంది ప్రియ. తొలుత క్యాబిన్ క్రూగా పనిచేసిన ఆమె హెలీక్యాప్టర్‌పై మనసు పారేసుకుంది.

కెప్టెన్ హోదాకు అవసరమైనన్ని గంటలు హెలీక్యాప్టర్ నడిపింది. 2017లో పూర్తిస్థాయిలో పైలట్‌గా కెరీర్ ప్రారంభించింది ప్రియ. ఇదివరకూ ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొన్న తనకు తాజా వరదలు పరీక్ష పెట్టాయని చెబుతుందామె. అయితే.. ఇలాంటి పరిస్థితుల్లోనూ రెస్క్యూ నిర్వహించేలా మేము శిక్షణ పొందాం అని గర్వంగా అంటోంది ప్రియ. భవిష్యత్‌లో మరింతమంది మహిళలు కెప్టెన్స్‌గా చూడాలనునకుంటున్న తను తల్లి కోరిక మేరకు ఎంబీఏ కూడా పూర్తి చేసింది.



# ఓనం సెలబ్రేషన్స్..

కేరళ రాష్ట్రంలో అతిపెద్ద పండుగ ఓనం. ఈ పండుగ మలయాళీలకు అత్యంత ప్రీతిపాత్రమైనది. తెలంగాణలో బతుకమ్మ, బోనాలు, ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి, తమిళనాట దీపావళి ఎంత ప్రసిద్ధో.. ఓనం కూడా కేరళ సంస్కృతికి ప్రతీక. కేరళ సంస్కృతి సంప్రదాయాలకు, సొంత గ్రామాలపై మమకారానికి, వ్యవసాయనికి ముడిపడిన పండుగే ఓనం. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది కేరళలోని వ్యవసాయ పండుగ. ఆగస్టు-సెప్టెంబర్ నెలలో వచ్చే ఈ పండుగను పది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకుంటుంటారు. ఇక ఈ పండుగను కేరళ ప్రజలే కాకుండా.. తమిళనాడు, కర్ణాటక సహా పలు రాష్ట్రాల ప్రజలు కుడా ఏటా ఎంతో ఘనంగా జరుపుకుంటుంటారు.



ప్రత్యేకతలు.. ఈ పండుగ సందర్భంగా పది రోజుల పాటు కేరళ రాష్ట్రంలో ఎక్కడ చూసినా.. ఏనుగుల స్వారీలు, తెల్లటి దుస్తుల్లో మగువలు, రకరకాల పూలతో సుందరంగా చేసిన అలంకరణలు అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటుంటాయి. ముఖ్యంగా ఆడపిల్లలు రకరకాల పువ్వులను సేకరించి వాటితో ఇంటి ముందు అందమైన ముగ్గు వేసి ఆ మధ్యలో దీపం వెలిగిస్తారు. దీన్ని మలయాళంలో పూక్కలం అంటారు. ఓనం సందర్భంగా కేరళలో రంగవల్లులపై పోటీలు కూడా నిర్వహిస్తుంటారు.

ఓన సద్యం.. ఇక ఈ పండుగ రోజున మలయాళీలు నిర్వహించే ఓనసద్యా అనే విందు చాలా ముఖ్యమైనది. ఈ విందులో సాధారణంగా అరటి ఆకులపై పలు రకాల ఆహార పదార్థాలు వడ్డిస్తారు. సంప్రదాయ ఊరగాయలు, అప్పడాలు, పాయసం, పప్పు, అన్నంతోపాటు రకరకాల పిండివంటలను చేసుకుని కుటుంబమంతా కలిసి ఆరగిస్తారు.

కసావు స్టైల్ చీర కట్టు.. ఈ పండుగలో పూజలు, ముగ్గులు, పిండి వంటలే కాదు.. సంప్రదాయబద్ధమైన కట్టూబొట్టుకూ ఎంతో ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా కసావు స్టైల్ చీరకట్టుకు ఈ పండుగలో ఎంతో ప్రత్యేకత ఉంది. బంగారు వర్ణంతో మెరిసిపోయే ఈ చీరకు రంగురంగుల డిజైనర్ బ్లౌజుల్ని జతచేసి బుట్టబొమ్మల్లా మెరిసిపోతుంటారు కేరళ కుట్టీలు. ఇక ఈ ఏడాది సెప్టెంబర్ 6వ తేదీన మొదలైన ఓనం వేడుకలు.. సెప్టెంబర్ 15న తిరుఓనంతో ముగుస్తాయి. ఈ ఏడాది కూడా ప్రజలు ఓనం పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.



## సీజేపీ నిరసనకారులకు సుప్రీంకోర్టు గుడ్‌న్యూస్



**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై సుప్రీంకోర్టు ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. జూలై 20 నుంచి 25 మధ్య జరిగిన నిరసనల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు రద??దు కానున్నాయి. జూలై 20 నుంచి 25 మధ్య జరిగిన సీజేపీ నిరసనలపై దేశంలో ఎక్కడా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2,873 నేరచరిత్ర కలిగిన వారి నేపథ్యంలో వారిపై ఎఫ్ఐఆర్‌ల నమోదుపై పోలీసులకు సుప్రీంకోర్టు స్వేచ్ఛనిచ్చింది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నష్టపరిహారం చెల్లింపులపై విధివిధానాలు రూపొందించాలని ఆదేశించింది. విధివిధానాలు రూపొందించిన మూడు నెలల్లోగా కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలరని చెప్పింది. ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహనకు కట్టుబడి ఉండాలనే షరతుకి లోబడి ఆర్టికల్ 142 కింద ఎఫ్ఐఆర్లను రద్దు చేస్తున్నామని, ఈ విధానాన్ని రాష్ట్రాలు సైతం పాటించవచ్చని పేర్కొంది.

విద్యార్థులపై కేసుల ఉపసంహరణతో కాక్రోచ్ జనతా పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న తలపెట్టిన ర్యాలీని రద్దు చేసుకుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు. మరోవైపు, అంతకుముందు ఎఫ్ఐఆర్‌ల రద్దుకు సుప్రీంకోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారు ఢిల్లీ , బిహార్, అస్సాం, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర పోలీసులు. రెండు పక్షాలు పరస్పర నమ్మకంతో సమస్యలను పరిష్కరించుకోవడం మంచిదని సీజేఐ చెప్పారు. విద్యార్థులను ప్రత్యర్థులుగా భావించడం లేదని సొలిసిటర్ జనరల్ తెలిపారు.

## సముద్ర భద్రతపై కొత్త సవాళ్లు!

**ముంబై:** ప్రపంచంలో ప్రస్తుతం వ్యూహాత్మక మార్పుల కాలం నడుస్తోందని, సముద్ర మార్గాల్లో ముప్పు పెరుగుతోందని, నౌకాయాన పరిస్థితుల్లోనూ చాలా తేడాలు వస్తున్నాయని భారత నావికాదళ అధ్యక్షుడు అడ్మిరల్ స్వామినాథన్ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం ఇందుకు ఒక కారణమని చెప్పారు.

సముద్ర గర్భంలో సుమారు 300 మీటర్ల లోతుల్లోనూ పనిచేయగల సరికొత్త జలాంతర్గామి 'ఐఎన్ఎస్ నిపుణ'ను సోమవారం జాతికి అంకితం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడ్మిరల్ స్వామినాథన్ మాట్లాడుతూ ముప్పు తీరుతెన్నులు నిరంతరం మారిపోతున్నాయని, కొత్త రకాల సవాళ్లు, సంక్లిష్టతలు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించారు. పశ్చిమ ఆసియాలో అస్థిరత నేపథ్యంలో ఆ ప్రాంతంలోని దేశాలు చాలా వేగంగా ఆయుధాలు సమకూర్చుకుంటున్నాయని, చెప్పారు. ఈ పరిస్థితుల్లో దేశ పశ్చిమ నౌకాదళ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంద న్నారు. 'దేశం ఏ రకమైన ముప్పు ఎదుర్కొంటుందో కచ్?చతంగా ఊహించడం ఎల్లప్పుడూ సాధ్యం కాకపోవచ్చు. కానీ, ముందస్తుగా అంచనాలున్న ముప్పులకు మాత్రం తయారుగా ఉండవచ్చు. అందుకు తగ్గ సామర్థ్యాన్ని పెంచు కోవచ్చు' అని ఆయన అన్నారు. పశ్చిమ నౌకాదళ కమాండ్ పరిధిలో ఉన్న దేశ తీర ప్రాంతం సామర్థ్యాలను పెంచడంలో ఐఎన్ఎస్ నిపుణ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

**300 మీటర్ల లోతులోనూ...** విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్పింగ్ యార్డ్ నిర్మించిన ఐఎన్ఎస్ నిపుణ్ 300 మీటర్ల లోతుల్లో జరిపే కార్యకలాపాలకూ దన్నుగా నిలవగలదు. భారతీయ నౌకాదళంలో ఇప్పటివరకూ ఇలాంటి నౌక ఒకటే ఉండగా... నిపుణ్ చేరికతో వీటి సంఖ్య రెండుకు చేరింది. సుమారు 119.4 మీటర్ల పొడవు, 10,500 టన్నుల సామర్థ్యం కలిగి ఉంటుంది. రక్షణ కార్యకలాపాలు వేగంగా నిర్వహించగల సామర్థ్యం దీని సొంతం. విపత్తు సహాయక చర్యలు, మానవతా సాయం చేరవేతలకు కూడా దీనిని వినియోగించవచ్చు.

## తమిళనాడు ఆలయాల్లో 'నో ఫోన్'..

**చెన్నై:** తమిళనాడులోని ప్రముఖ ఆలయాల్లో ఇకపై సెల్‌ఫోన్ మోగదు.. కెమెరా క్లిక్‌మనదు. ఆలయాల పవిత్రత, ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ఆలయ ప్రాంగణాల్లోకి మొబైల్ ఫోన్లను తీసుకెళ్లడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. నేటి (సెప్టెంబర్ 1) నుంచి రాష్ట్రంలో తొలి దశలో 52 ప్రధాన ఆలయాల్లో ఈ నిబంధనను అమలు చేస్తున్నారు.

ఆలయాల్లో సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు, సోషల్ మీడియా రీల్స్ చిత్రీకరణకు అడ్డుకట్ట వేయడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. దేవతామూర్తులతో పాటు వీఐపీలు, ప్రముఖులు, సినీ తారల ఫొటోలు, వీడియోలు తీయడానికీ అనుమతి ఉండదు. భక్తులు తమ మొబైల్ ఫోన్లను ఆలయాల ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన డిపాజిట్ కేంద్రాల్లో భద్రపరచుకోవాలి. ఒక్కో ఫోన్‌కు రూ.5 ఫీజు వసూలు చేసి రసీదు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. దర్శనం అనంతరం రసీదు చూపించి తమ ఫోన్లను తిరిగి తీసుకోవచ్చు.

ఈ నిర్ణయానికి 2022లో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా ఆధారంగా ఉన్నాయి. ఆలయాల పవిత్రత, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణాల్లో మొబైల్ ఫోన్లు, కెమెరాల వినియోగాన్ని నియంత్రించవచ్చని కోర్టు పేర్కొంది. దీంతో ఇకపై తమిళనాడులోని ప్రముఖ ఆలయాలకు వెళ్లే భక్తులు 'ముందు దర్శనం.. ఆ తర్వాతే ఫోన్' అన్న నిబంధనను పాటించాల్సి ఉంటుంది.

## 'చలో వెలుగోడు'లో ఉద్రిక్తత..

**నంద్యాల:** నంద్యాల జిల్లాలోని బండి ఆత్మకూరు వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. వెలుగోడు రిజర్వాయర్ నుంచి వెంటనే నీటిని విడుదల చేసి చెరువులను నింపాలంటూ వైఎస్సార్‌సీపీ నేతలు 'చలో వెలుగోడు రిజర్వాయర్' పిలుపు నిచ్చారు. ఈ క్రమంలో వెలుగోడుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు శిల్పా చక్రపాణి, రవిలను శిల్పా రవిని పోలీసులు అడుగడుగునా అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.. ఈ నేపథ్యంలో రైతుల కోసం నీళ్లు అడిగితే అడ్డుకుం టారా? అని పోలీసుల తీరుపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా వెలుగోడు రిజర్వాయర్లను ముట్టడిస్తామని శిల్పాచక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు.. బస్టాండ్ వద్ద రైతులు నిరసన తెలుపుతున్నారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ.. వెంటనే కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెలుగోడు నుండి నీటిని విడుదల చేసి చెరువుల నింపాలని మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవి కూటమి సర్కార్‌ను కోరారు.

# ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వొద్దు



**పులివెందుల:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పులివెందుల పర్యటన కొనసాగుతోంది. భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను ఓపికగా విన్న ఆయన, పార్టీ నాయకులతో కూడా మాట్లాడారు.స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులకు వైఎస్ జగన్ పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలని అన్నారు. ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి స్థానంలో పోటీకి సిద్ధం కావాలన్నారు. "వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలును ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలి. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలి. పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకుని, గ్రామాలు, వార్డుల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలి. అధికార బలాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షంపై ఒత్తిళ్లు తీసుకురావడం, పోలీసులను ఉపయోగించి బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే ప్రయత్నాలు జరిగితే వాటిని ధైర్యంగా, సంఘటితంగా ఎదుర్కోవాలి. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ, నాడు--నేడు, ఆరోగ్యశ్రీ విస్తరణ, విద్యా రంగంలో సంస్కరణలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు అధికారంలోకి వచ్చిన తర్వాత భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రజల మధ్యే ఉండాలి... వారి సమస్యలపై పోరాడాలి... వైఎస్సార్‌సీపీ పాలనలో వారికి జరిగిన మంచిని గుర్తుచేయాలి. అలా చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడం కష్టం కాదు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం కొనసాగించాలి. పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సిద్ధం కావాలి. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసి, ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలి" అని వైఎస్ జగన్ సూచించారు.

# పల్నాడులో కలవరపెడుతున్న టీనేజ్ ప్రెగ్నెన్సీలు!

**నరసరావుపేట:** పల్నాడు జిల్లాలో కౌమార బాలికల్లో గర్భధారణ (టీనేజ్ ప్రెగ్నెన్సీ) ఆందోళన కలిగిస్తోంది. ఆర్థిక, సామాజిక అసమానతలు అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లాలో బాల్యవివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ అధికంగా ఉండటం మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. బాలికల వయసు 13 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న సమయంలో గర్భం దాల్చడం వల్ల వారి ఆశలన్నీ నీరుగారుతున్నాయి. అక్కడితో వారి జీవితం బాధ్యతల్లో బందీ అవుతోంది. మరోవైపు శారీరక, మానసిక ఆరోగ్యపరంగా వారిలో చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

దీంతో ఈ ప్రభావం ఆ కుటుంబం, సమాజంపై తీవ్రంగా పడుతోంది. బాల్యవివాహాలు, తెలిసీ తెలియని వయసులో క్షణికావేశం, అత్యాచారాలు వంటి ఘటనలు చిన్న వయసులో గర్భం దాల్చడానికి కారణమవుతున్నాయి. దీంతో తల్లీబిడ్డలను ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో పాటు మాతాశిశు మరణాల ప్రమాదమూ పెరుగుతోంది. బాలికలు గర్భం దాలి?చన సమయంలో హైపర్‌టెన్షన్, ఎనీమియా వంటి సమస్యలు తలెత్తి, అధిక శాతం సిజేరియన్ కాన్పులకు దారి తీస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే ప్రోత్సాహకాలు అందాలంటే గర్భిణులకు తప్పనిసరిగా 19 ఏళ్లు నిండి ఉండాలి. అయితే చిన్నారి బాలింతలకు ఈ పథకాలు దూరం కావడంతో సరైన పోషకాలు, ఆర్థిక సహకారం, వైద్యసేవలు అందడం లేదు.

**7.71 శాతం మంది వారే...** పల్నాడు జిల్లాలో అత్యధికంగా మాచర్ల, గురజాల, వినుకొండ, పెదకూరపాడు నియోజకవర్గాల్లో



టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికంగా నమోదవుతున్నాయి. ఆగస్టు నెలకు సంబంధించి ఐసీడీఎస్ లెక్కల ప్రకారం తొమ్మిది ప్రాజెక్టుల కింద మొత్తం 8,900 మంది గర్భిణులు నమోదయ్యారు. ఇందులో ఏకంగా 686 మంది బాలికలు గర్భవతులయ్యారని లెక్కలు చెబుతున్నాయి. ఇందులో మాచర్లలో 1,393 మందికి 116 మంది, ఈపూరు ప్రాజెక్టు పరిధిలో 532 మంది గర్భిణుల్లో 79 మంది, గురజాలలో 643 మందిలో 71 మంది, పిడుగురాళ్లలో 846 మందిలో 70 మంది టీనేజ్ ప్రెగ్నెన్సీలు నమోదయ్యాయి. జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ 7.71 శాతంగా నమోదవ్వడం ప్రమాద హెచ్చరికలను జారీ చేస్తోంది. అనధికారికంగా ఇంకా ఎక్కువే టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఉండే అవకాశముందని, చట్టవ్యతిరేకం కావడంతో కుటుంబ సభ్యులు బయటకు రాకుండా చూస్తున్నారని సమాచారం.

# ఇక్కడ ఊపిరే ఓ సవాల్.. భారత్‌లో అద్భుత గ్రామం!



ఊపిరి పీల్చుకోవడమే కష్టమైనంత పలుచని గాలి.. అడుగు బయటపెడితే గడ్డకట్టించే చలి.. కళ్లెదుట ఎక్కడ చూసినా మంచుకొండలే.. చెట్లు కనిపించవు.. శీతాకాలంలో దాదాపు ఆరు నెలలు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అయినా అక్కడ మనుషులు నివసిస్తున్నారు. ఇళ్లలో సంబరాలు చేసుకుంటున్నారు. పశువులను పెంచుతున్నారు. జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇది ఏ సైన్స్ ఫిక్షన్ కథ కాదు.. హిమాలయాల ఒడిలో సముద్ర మట్టానికి 15,050 అడుగుల ఎత్తులో ఉన్న కొమిక్ గ్రామం కథ!

**ఆకాశానికి దగ్గరగా కొమిక్..**

హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పితి లోయలో ఉన్న కొమిక్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మానవ నివాస ప్రాంతాల్లో ఒకటి. సముద్ర మట్టానికి సుమారు 4,587 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ చిన్న బౌద్ధ గ్రామంలో దాదాపు 100 మంది నివసిస్తున్నారు. గ్రామ ప్రవేశద్వారం వద్దే ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటారుబుల్ రోడ్డుతో అనుసంధానమైన గ్రామమని తెలిపే బోర్డు కనిపిస్తుంది. మంచుతో కప్పబడిన హిమాలయ శిఖరాల మధ్య తెల్లని మట్టి, రాతి ఇళ్లు.. నీలాకాశం కింద నిశ్శబ్దంగా కనిపించే ఈ గ్రామం ఫొటోల్లో చూస్తే స్వర్గంలా అనిపిస్తుంది. కానీ అక్కడ నివసించే వారికి మాత్రం ప్రతి రోజు ఓ సవాలే.

**ఆక్సిజన్ కూడా విలాసమే!:** సముద్ర మట్టంతో పోలిస్తే కొమిక్‌లో ఆక్సిజన్ స్థాయి చాలా తక్కువ. అక్కడికి కొత్తగా వెళ్లే వారికి పలుచని గాలితో శరీరం ఇబ్బంది పడుతుంది. కొందరిలో ఆక్సిజన్ సాచురేషన్ గణనీయంగా పడిపోవచ్చు. అయితే తరతరాలుగా అక్కడే నివసిస్తున్న స్థానికులు ఈ వాతావరణానికి అలవాటు పడిపోయారు. అక్కడి ప్రజల జీవితం ప్రకృతితో నిరంతర పోరాటమే. తీవ్రమైన చలి కారణంగా చెట్లు, చాలా మొక్కలు కూడా పెరగడం కష్టం. నీరు గడ్డకట్టేంత చలి ఉంటుంది. శీతాకాలంలో పరిస్థితులు మరింత దారుణంగా మారతాయి.

**ఆరు నెలలు ప్రపంచానికి దూరం!** : భారీ మంచు కారణంగా స్పితి లోయలోని పర్వత మార్గాలు మూసుకుపోతాయి. ఫలితంగా కొమిక్ సహా ఈ ప్రాంతంలోని గ్రామాలు సంవత్సరంలో దాదాపు ఆరు నెలల పాటు దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి దాదాపు పూర్తిగా వేరుపడతాయి. ఫోన్, ఇంటర్నెట్ సదుపాయాలు కూడా పరిమితమే. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కీలక సౌకర్యాలు దూరంగా ఉంటాయి. అయినా స్థానికులు తమకు తామే ఏర్పాట్లు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొమిక్ ఇళ్ల నిర్మాణం కూడా అక్కడి వాతావరణానికి తగ్గట్టుగానే ఉంటుంది. మట్టి, రాళ్లతో నిర్మించే ఇళ్ల గోడలు దాదాపు రెండు అడుగుల మందంతో ఉంటాయి. ఇళ్లకు తెల్లని రంగు వేయడం ద్వారా పగటి సూర్యకాంతిని ప్రతిబింబింపజేసి లోపల వెచ్చదనాన్ని కొంతమేర కాపాడుకుంటారు.



చుట్టుపక్కల చెట్లు లేకపోవడంతో ఇంధనం కూడా సమస్యే. యాక్‌లు, ఆవులు, గాడిదల ఎండిన పేడను ఇంధనంగా ఉపయోగిస్తారు. రాత్రి వేళ పశువులను కూడా తీవ్ర చలి నుంచి రక్షించేందుకు ఇళ్లలోనే ఉంచుతారు.

**నీరు గడ్డకట్టినా.. జీవితం ముందుకు!** : చలికాలంలో నీరు గడ్డకట్టడం సాధారణమే. ఇలాంటి పరిస్థితుల్లో స్థానికులు తమ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక పద్ధతులను అవలంబిస్తారు. పాత్రలు కడగడానికి కూడా కట్టెల సాయంతో నీటిని వేడి చేసుకునే ఏర్పాట్లు చేసుకుంటారు. ఇక్కడి జీవితం మనకు సాధారణంగా అనిపించే ఎన్నో విషయాల విలువను గుర్తుచేస్తుంది. నీరు, వేడి, ఆక్సిజన్.. మనకు సహజంగా లభించే ఇవన్నీ కొమిక్ ప్రజలకు విలువైన వనరులే. కొమిక్ చుట్టుపక్కల ప్రాంతం ప్రకృతి అందాలతోనే కాదు.. కోట్ల సంవత్సరాల చరిత్రతోనూ ఆశ్చర్యపరుస్తుంది. సమీపంలోని లాంగ్జా గ్రామంలో లభించే సముద్ర జీవుల శిలాజాలు.. ఈ ప్రాంతంలో ఒకప్పుడు టెథిస్ సముద్రం ఉండేదని సూచిస్తున్నాయి. అంటే నేడు మంచుకొండలు కనిపిస్తున్న ఈ ప్రాంతం.. కోట్ల సంవత్సరాల క్రితం సముద్రంలో భాగంగా ఉండేదన్నమాట!.

**ప్రపంచంలోనే ఎత్తైన పోస్టాఫీసు..** కొమిక్‌కు సమీపంలోని హిక్కిమ్ గ్రామం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పోస్టాఫీసుల్లో ఒకటికి ప్రసిద్ధి చెందింది. పరిమిత కనెక్టివిటీ ఉన్నప్పటికీ దశాబ్దాలుగా ఈ పోస్టాఫీసు ఈ మారుమూల ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తోంది. కొమిక్‌లో జనాభా తక్కువ. ఇళ్లు కూడా కొద్దే. కానీ అక్కడి ప్రజల మధ్య బంధం మాత్రం బలంగా ఉంటుంది. గ్రామంలోని ఒక ఇంట్లో వేడుక జరిగితే.. అది ఒక్క కుటుంబానిదిగా ఉండదు. ఊరంతా కలిసి సంబరాల్లో భాగమవుతుంది.

ప్రకృతి ఎంత కఠినంగా ఉన్నా.. మనుషుల మధ్య ఆప్యాయత మాత్రం ఆ చలిని జయిస్తుంది. మంచుకొండల మధ్య.. ఆకాశాన్ని తాకే ఎత్తులో.. ఆక్సిజన్ తక్కువగా ఉన్నా ఆశలు మాత్రం ఎక్కువగా ఉన్న గ్రామం కొమిక్. ప్రపంచానికి దూరంగా ఉన్న ఈ చిన్న గ్రామం.. ప్రకృతి ఎంత కఠినమైనా మనిషి జీవించాలనే పట్టుదల ముందు అది కూడా ఓడిపోతుందని నిరూపిస్తోంది.



## మారికవలసలో టెన్షన్.. టెన్షన్

**విశాఖపట్నం:** విశాఖ జిల్లా మారికవలస గురుకులం దగ్గర ఆందోళన కొనసాగుతోంది. గిరిజనుల గురుకుల పాఠశాల పోరాటంపై పోలీసులు ఉక్కు పాదం మోపారు. మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, మాజీ మంత్రి బాలరాజును పోలీసులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు సంఘీభావం తెలిపేందుకు వెళు ండగా అడ్డుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం అని కూడా చూడకుండా పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారు. రోడ్డుపై ఉండడానికి వీల్లేదని జీప్ ఎక్కాలంటూ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు బెదిరింపులకు దిగారు. పోలీసుల తీరుపై పుష్పశ్రీవాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లడం తప్పా అంటూ ఆమె ప్రశ్నించారు.

మారికవలస హైవేపై ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మధ్య వాగ్వాదం జరిగింది. మాజీ డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి మాట్లాడుతు.. మహిళలు చూడకుండా పోలీసులు అమర్యాదగా వ్యవహరించారన్నారు. గిరిజన మహిళలంటే అంత చులకన. తల్లిదండ్రుల పోరాటానికి సంఘీభావం తెలపడం తప్పా?. శాంతియుతంగా నిరసన చేస్తే అడ్డుకుంటారా? గిరిజనుల హక్కులను కాల రాసే హక్కు ఈ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారు" అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖలో హై టెన్షన్ నెలకొంది. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖ మారికవలస గురుకుల పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ప్రశ్నించడానికి వెళ్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగంను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. అనుమతి లేదంటూ బలవంతంగా అడ్డుకుని విశాఖ మూడో టౌన్ స్టేషన్‌కు తరలించారు.

ప్రజా గొంతుకను నొక్కేందుకే ఈ అక్రమ అరెస్టులా.? అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. గురుకుల విద్యార్థులకు అండగా నిలిచినందుకు వెళ్తున్న ఎమ్మెల్యేను అరెస్ట్ చేస్తారా? వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ దగ్గరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు.

## హిమాలయ బోర్డు ఏర్పాటు చేయాలి

**కఠ్మాండు:** హిమాలయ ప్రాంతాల్లో విపత్తులను ఎదుర్కోవడానికి ఐదు సరిహద్దు దేశాలతో కలిపి హిమాలయ బోర్డును ఏర్పాటు చేయాలని ఆధ్యాత్?మక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ డిమాండ్‌చేశారు. సున్నితమైన ఈ పర్వత ప్రాంతానికి రాజకీయాలకు అతీతంగా భారత్, చైనా, పాకిస్తాన్, నేపాల్, భూటాన్‌లతో కూడిన సరిహద్దు సహకారం అవసరమన్నారు. ఆదివారం కఠ్మాండులో ఏర్పాటు చేసిన 'నేపాల్‌కు సంఘీభావం'కార్యక్రమంలో ప్రసంగించారు. తక్షణ సహాయానికి మించి, హిమాలయాలపై విస్తృత స్థాయిలో సామూహిక బాధ్యత అవసరమని సద్గురు పిలుపునిచ్చారు. ఆ పర్వతాలు దేశాల మధ్య గీసిన సరిహద్దులకు అతీతమైనవని, వాటి భవిష్యత్తు వాటిపై ఆధారపడిన వారందరికీ సంబంధించినదని గుర్తించాలని ఆయన అన్నారు. 'పర్వతాలకు మీ రాజకీయాలు తెలియదు. మీరు మాట్లాడే అర్థంలేని మాటలు లేదా భాష పర్వతాలకు తెలియదు. హిమాలయ ప్రాంతం భూమిపై అద్భుతమైన, సున్నితమైన ప్రాంతం. అటువంటి పర్వతాల రక్షణ కోసం అవి విస్తరించి ఉన్న దేశాలన్నింటితో కూడిన ఒక సంస్థ ఏర్పాటు తక్షణ అవసరం. ఈ విపత్తు తీవ్రత ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంది. దీని పరిణామాలను నేపాల్ లాంటి చిన్నదేశం ఒంటరిగా ఎదుర్కోలేదు. మనం దీనిపై దృష్టి పెట్టాలి'అని ఆయన అన్నారు.

**కోటి రూపాయల విరాళం..** నేపాల్ ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి కోటి రూపాయల విరాళంగా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారని ఇషా ఫౌండేషన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. చైనా--నేపాల్ సరిహద్దు సమీప ప్రాంతాల్లో సంభవించిన భారీ ఆకస్మిక వరదల తర్వాత ఇషా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది యాత్రికుల బృందం ఆచూకీ లేకుండా పోయింది. నేపాల్ వైపున ఉన్న ముగ్గురు ఇషా వలంటీర్ల ఆచూకీ లభ్యం కాలేదని తెలిపింది. ఇషా ఫౌండేషన్ ప్రతి సీజన్‌లో కైలాస్ మానసరోవర్ యాత్రలను నిర్వహిస్తోంది. యాత్రలో భాగంగా కాలినడకన ట్రెక్కింగ్ చేస్తూ బృందాలు కఠ్మాండు నుంచి నేపాల్ మీదుగా టిబెట్‌కు వెళ్తాయి.

## వరదల్లో బ్యాంకు లాకర్లు..



**ఖాట్మండు:** నేపాల్ వరదలు సృష్టించిన బీభత్సం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అకస్మాత్తుగా వచ్చిన వరదలు తీవ్రమైన ప్రాణనష్టం కలిగించడంతో పాటు పెద్దఎత్తున ఆస్తినష్టం కలిగించాయి. మృతుల సంఖ్య ఇప్పటికీ పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో నేపాల్ పోలీసులకు ఇప్పుడు కొత్త తలనొప్పి వచ్చి పడింది. భారీస్థాయిలో వచ్చిన వరదలకు పెద్దఎత్తున లాకర్లు నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడంతో వాటి కోసం ఇప్పుడు తీవ్ర స్థాయిలో గాలింపులు చేపడుతున్నారు. వరద ప్రవాహంలో దాదాపు 20 బ్యాంకులకు చెందిన లాకర్లు కొట్టుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. వాటిని సురక్షితంగా స్వాధీనం చేసుకోవడం, అవి దుండగుల చేతుల్లోకి వెళ్లకుండా చూడటం పోలీసులకు మరో పెద్ద బాధ్యతగా మారిందని తెలిపారు. ఈ వాల్ట్‌లలో కొన్ని భారీ మొత్తంలో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ వివరాలపై డీఐజీ అబి నారాయణ్ కాఫ్లే మాట్లాడుతూ, వరదల అనంతరం నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో ప్రస్తుతం పోలీసుల ప్రధాన ప్రాధాన్యత గల్లంతైన వ్యక్తుల కోసం గాలించడం, వారిని రక్షించడమేనని తెలిపారు. అదే సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత కూడా తమపై ఉందన్నారు. "రసువా, ధాదింగ్, చిత్వన్ తదితర ప్రాంతాల్లోని పలు బ్యాంకులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నగదు, బంగారం వంటి విలువైన వస్తువులు ఉన్న వాటిలో చాలా వాల్ట్‌లు వరదల్లో కొట్టుకుపోయాయి. మరికొన్ని భారీగా పేరుకుపోయిన బురద కింద కూరుకుపోయాయి. మా సిబ్బంది ప్రస్తుతం ఆ వాల్ట్‌లను గుర్తించి, సురక్షితంగా స్వాధీనం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కొట్టుకుపోయిన వాల్ట్‌లను కొందరు వ్యక్తులు పగులగొట్టి నగదును దొంగిలించిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి" అని కాఫ్లే తెలిపారు.

## వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించిన జగన్



**వైఎస్సార్ జిల్లా:** దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. బుధవారం ఉదయం ఇడుపుల పాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించి అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ ప్రార్థనలకు.. కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నేతలు, కార్యకర్తలు నివాళులు అర్పిస్తున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆశయాలు సాధిస్తాం.. జోహార్ వైఎస్సార్ అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు నినాదాలు చేశారు.

## జీఎస్టీ ధమాల్

**అమరావతి:** చంద్రబాబు పాలనలో రాష్ట్ర జీఎస్టీ(గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్) ఆదాయం మరోసారి పడిపోయింది. వరుసగా మూడో ఏడాది కూడా నేల చూపులు చూస్తోంది. సంపద సృష్టిస్తానంటూ ఎన్నికలకు ముందు చెప్పిన చంద్రబాబు.. ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్ర సంపదను పూర్తిగా ఆవిరి చేస్తున్నారు. జీఎస్టీ ఆదాయం గతేడాది కన్నా ఈ ఏడాది మెరుగ్గా ఉంటే దాన్ని సంపద వృద్ధి అంటారు. కానీ చంద్రబాబు పాలనలో గతేడాది ఆగస్టులో వచ్చిన జీఎస్టీ ఆదాయంతో పోల్చితే ఈ ఏడాది ఆగస్టులో ఏకంగా 7 శాతం క్షీణత నమోదైంది. గతేడాది ఆగస్టులో రూ.3,710 కోట్ల జీఎస్టీ రాబడి ఉండగా.. ఈ ఆగస్టులో రూ.3,438 కోట్లకే పరిమితమైంది. అంటే రూ.272 కోట్ల మేర పతనమైందని స్పష్టమవుతోంది. ఇక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో జీఎస్టీ రాబడి రూ.18,393 కోట్లే వచ్చింది. అంటే గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోల్చి చూస్తే 1.14 శాతం క్షీణత నెలకొంది. దేశంలో బిహార్ సహా మిగతా రాష్ట్రాల్లో వృద్ధి నమోదవుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం నెలనెలా పరిస్థితి దిగజారడం గమనార్హం.

## గోదావరి పుష్కరాల కోసం మరో రూ.100 కోట్లు

**అమరావతి:** 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' పేరుతో గోదావరి పరీవాహక ప్రాంత గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాల కోసం అదనంగా మరో రూ.100 కోట్లు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఇప్పటికే రూ.100 కోట్లు విడుదల చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 'పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల ద్వారా కేటాయించిన నిధులతో బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం జిల్లాల పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో రూ.90 కోట్లతో 111 రహదారుల పనులు చేపట్టనున్నాం. వీటి ద్వారా సుమారు 141 కిలోమీటర్ల మేర సిమెంట్, తారు రోడ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇంకో రూ.10 కోట్లతో ప్రతి ఘాట్‌వద్ద తాగునీటి సదుపాయం కల్పిస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

### సముద్ర మట్టాల పెరుగుదలతో కోల్‌కతా, ముంబైకి ముప్పు

**న్యూఢిల్లీ:** సముద్ర మట్టాలు పెరుతున్న కారణంగా భారతదేశంలోని కోల్‌కతా, ముంబై నగరాలలో లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఐక్యరాజ్యసమితి తన తాజా నివేదికలో వెల్లడించింది. 'సముద్ర మట్టాల పెరుగుదలకు సంబంధించిన సవాళ్లు, దానిని పరిష్కరించే మారా ?గలు, విధానాలు' అనే శీర్షికతో ఐరాస జనరల్ సెక్రటరీ విడుదల చేసిన నివేదిక ప్రకారం సముద్ర మట్టాల పెరుగుదల ఇకపై సుదూర ముప్పు కాదని, చరిత్రలో ఎన్నడూ లేనంత వేగంగా ఇప్పుడు జరుగుతోందని స్పష్టమవుతున్నది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలన్నింటికీ ఇది పెను సవాలుగా మారింది.

## వాణిజ్య సిలిండర్‌పై రూ.11.50 వడ్డన

**న్యూఢిల్లీ :** దేశీయ విమానయాన సంస్థలు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ఏటీఎఫ్)తోపాటు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగించే వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్లు, వాహనాలకు ఇంధనంగా ఉపయోగపడే సీఎన్‌జీ, గృహాలు, పరిశ్రమలకు భూగర్భ పైపులైన్ల ద్వారా సరఫరా చేసే పీఎన్‌జీ ధరలు మంగళవారం నుంచి పెరిగాయి. ఏటీఎఫ్ ధర లీటర్‌కు రూ.6.28(5.46 శాతం) పెరిగి రూ. 121.28కి చేరింది.

ప్రభుత్వ రంగ చమురు సంస్థల గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 1న లీటర్‌కు రూ.5 పెంపు తర్వాత తాజా పెంపు చోటుచేసుకుంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ వాటా 40 శాతం వరకు ఉంటుంది. ఇది ఆ సంస్థలపై ఖర్చుల భారాన్ని పెంచుతుంది. కాగా వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరలు కూడా పెరిగాయి. 19 కిలోల సిలిండర్ ధర రూ.9.50 పెరిగి రూ.2,747.50కి చేరగా, 5 కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2 పెరిగి రూ.764కి చేరుకుంది. పశ్చిమాసియా సంక్షోభ సమయంలో ధరలు భారీగా పెరిగిన తర్వాత తాజాగా మరోసారి ధరల పెంపు చోటుచేసుకుంది. ఫిబ్రవరి, జూన్ మధ్య కాలంలో 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1,740.50 నుంచి రూ.3,113. 50కి పెరిగింది. అంటే రూ.1,373 మేర పెరుగుదల నమోదైంది. ప్రధాన నగరాల్లో కూడా ధరలు పెరిగాయి. ముంబైలో 19 కిలోల సిలిండర్ ధర రూ.9.50 పెరిగి రూ.2,701కి చేరింది. కోల్‌కతాలో రూ.11.50 పెరిగి రూ.2,884కి, అలాగే చెన్నైలో రూ.10.50 పెరిగి రూ.2,916.50కి ధరలు చేరాయి. అయితే 14.2 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.942 వద్ద యథాతథంగా కొనసాగుతున్నది. దీని ధరలో చివరిసారిగా జూన్ 7న సిలిండర్‌కు రూ.29 మేర పెంపు జరిగింది. మహానగర్ గ్యాస్ లిమిటెడ్ మంగళవారం నుంచి సీఎన్‌జీ ధరలను కిలోకు రూ.2, దేశీయ పీఎన్‌జీ ధరలను ప్రతి స్టాండర్డ్ క్యూబిక్ మీటర్‌కు రూ.1 పెంచింది. ముంబై, దాని పరిసర ప్రాంతాలలో సీఎన్‌జీ ధర ఇప్పుడు కిలోకు రూ.88గా ఉంది. ఈ పీఎన్‌జీ ధరల పెంపు సుమారు 30 లక్షల దేశీయ వినియోగదారులకు వర్తిస్తుంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ ధరలతో ముడిపడి ఉన్న అధిక ఇన్‌పుట్ గ్యాస్ ఖర్చులనే ధరల పెంపునకు కారణంగా కంపెనీ పేర్కొంది.

# 'సర్' కొనసాగుతుండగా స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?

**అమరావతి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కొనసాగుతుండగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ప్రశ్నించింది. సర్‌లో గల్లంతైన ఓటర్లకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని, వారు తిరిగి ఓటుహక్కు పొందే ఆస్కారం ఉందని గుర్తు చేసింది. దీంతో తుది ఓటర్ల జాబితాలో మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపింది. సర్ ప్రక్రియ ముగిసేవరకు వేచిచూడకుండా.. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తే చాలామంది ఓటుహక్కు కోల్పోతారని పేర్కొంది.

ఈ విషయంలో వైఎస్సార్‌సీపీ వ్యక్తం చేస్తున్న ఆందోళన సహేతుకమైనదని హైకోర్టు స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతున్న నేపథ్యంలో.. వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని కూడా ఆ ధర్మాసనం ముందుంచడం సముచితమని న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

సర్ ప్రక్రియ ముగిసి తుది ఓటర్ల జాబితా ప్రచురించిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ సుజాత మంగళవారం విచారణ జరిపారు.

**నోటిఫికేషన్ విడుదలైతే మా వ్యాజ్యం నిరర్థకం అవుతుంది**

వైఎస్సార్‌సీపీ తరఫున సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందున్న వ్యాజ్యాలకు తాము దాఖలు చేసిన ఈ వ్యాజ్యానికి సంబంధమే లేదని తెలిపారు. ఆ వ్యాజ్యాల్లో పిటిషనర్లు ఏం కోరారు.. తాము ఈ వ్యాజ్యంలో ఏం కోరుతున్నా అన్న వివరాలను ఆయన న్యాయమూర్తి ముందుంచారు. ఈ నెల 9న సీజే ధర్మాసనం ముందు ఈ వ్యాజ్యాలు విచారణ కు రానున్నాయని, ఆలోపు



ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే, తాము దాఖలు చేసిన ఈ వ్యాజ్యం నిరర్థకం అవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత అందులో న్యాయస్థానాల జోక్యంపై నిషేధం ఉందని తెలిపారు. ప్రస్తుతం సర్ ప్రక్రియ కొనసాగుతోందని, ఎన్నికల రికార్డులన్నీ కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల సీజే ధర్మాసనానికి నివేదించిందని శ్రీరామ్ న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు.

**ఆ వ్యాజ్యాలతో జత చేయండి**

రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. సర్ ప్రక్రియ స్థానిక ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అడ్డంకి కాదన్నారు. పంచాయతీలకు సంబంధించి వార్డుల ఓటర్ల జాబితా ప్రచురణ ఈ ఏడాది ఏప్రిల్ 15న పూర్తయిందని, పట్టణ స్థానిక సంస్థల ఓటర్ల జాబితాను సెపట?టంబర్ 3న ప్రచురిస్తారని చెప్పారు. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికలపై సీజే ధర్మాసనం విచారణ జరుపుతోందని, ఈ వ్యాజ్యాన్ని కూడా సీజే ధర్మాసనానికే పంపాలని కోరారు.

ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ 'సర్' ప్రక్రియ ముగియకుండా స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది కనపర్తి అజయ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ అభ్యర్థనను అనుమతిస్తే స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం అవుతాయన్నారు. సర్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికలను ఆపాలంటే మొత్తం ప్రక్రియను మొదటి నుంచి మొదలు పెట్టాల్సి ఉంటుందని, ఇందుకు ఐదారు నెలల సమయం పడుతుందని తెలిపారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని సీజే ధర్మాసనం ముందున్న స్థానిక ఎన్నికల వ్యాజ్యాలతో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

**అనుబంధ ఓటర్ల జాబితాను ప్రచురించమని చెప్పండి**

ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో లక్షల సంఖ్యలో ఓటు కోల్పోయిన వారున్నారని శ్రీరామ్ కోర్టుకు తెలిపారు. వీరిలో నిజంగా ఓటు కోల్పోయిన వారు సంబంధిత అధికారుల వద్ద అప్పీల్ దాఖలు చేసుకుని, తిరిగి ఓటు పొందే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 3 నాటికి సర్ ప్రక్రియ ముగియనుందని, ఆ తరువాత తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారని తెలిపారు. ఈ ఏడాది జనవరి 1ని అర్హత తేదీగా అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ఆధారంగా సెప్టెంబర్ 3లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చిందని వివరించారు.

సర్ ప్రక్రియను ముగించి అక్టోబర్ 3న కేంద్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా ప్రచురించనుందని తెలిపారు. ఆ ఓటర్ల జాబితా ఆధారంగా మాత్రమే స్థానిక ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోర్టును అభ్యర్థించారు. ఒకవేళ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ, నామినేషన్ల ముగింపు తేదీ నాటికి సర్ ప్రక్రియ వల్ల ఓటర్ల జాబితాలో జరిగే మార్పులు, చేర్పులను పరిగణనలోకి తీసుకుని అనుబంధ ఓటర్ల జాబితాను విడుదల చేసేలా కూడా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోర్టును అభ్యర్థించారు.

# ఉక్కుకు వెన్నుపోటు పొడిచిన సర్కారు

**విశాఖపట్నం :** విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదంతో ఆవిర్భవించిన స్టీల్ ప్లాంట్‌ని కనుమరుగు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా మొన్న.. ప్లాంట్ నుంచి సీఐఎస్ఎఫ్ బలగాల ఉప సంహరణ ప్రక్రియ మొదలుపెట్టిన యాజమాన్యం.. తాజాగా రూ.వందల కోట్ల విలువ చేసే ప్లాంట్ మిగులు భూముల వేలానికి తెరతీసింది. హెచ్‌బీ కాలనీ, గాజువాక ఆటోనగర్ ప్రాంతాల్లో ఉన్న 459 ప్లాట్ల విక్రయానికి రూ.858.68 కోట్ల రిజర్వ్ ధరతో నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) మంగళవారం ఈ-ఆక్షన్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఉద్యోగ, కార్మిక సంఘాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. నిధుల సమీకరణ, అసెట్ మానిటైజేషన్ పేరుతో జరుగుతున్న ఈ వేలం ప్రక్రియ వాస్తవానికి ప్లాంట్ ఆస్తులను ముక్కలు ముక్కలుగా చేసి ప్రైవేట్‌కు అప్పగించే వ్యూహంలో భాగమేనన్న అనుమానాలు బలపడుతున్నాయి. మూడు దశాబ్దాలకు పైగా తెలుగువారి ఆత్మ గౌరవానికి, పోరాటాలకు ప్రతీకగా నిలిచిన విశాఖ ఉక్కు ఆస్తులను బేరం పెట్టడం ముంచుకొస్తున్న ప్రైవేటీకరణ తుపానుకు బలమైన సంకేతమని భావిస్తున్నారు. ఇన్నాళ్లూ ప్రైవేటీకరణ జరగనివ్వబోమంటూ అబద్ధాలు వల్లెవేస్తూ మోసం చేస్తూ వచ్చిన చంద్రబాబు సర్కారు మరో కుట్రపూరిత నిర్ణయానికి కొమ్ము కాస్తోందని, విశాఖ ఉక్కుకు వెన్నుపోటు పొడిచిందని ఉద్యోగ, కార్మిక వర్గాలు మండిపడుతున్నాయి. భూముల వేలం ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలని, సంస్థకు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేసి ప్లాంట్‌ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నాయి.

**వేలం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ప్రకటన..** తాజాగా ఎన్ఎల్ఎంసీ మొత్తం 459 ప్లాట్లను ఈ--వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో అత్యధికంగా నగర నడి‘డ్డున ఉన్న సీతమ్మధార పరిధిలోని హెచ్‌బీ కాలనీలో రూ.838.93 కోట్ల రిజర్వ్ ధరతో 87,949.77 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న 456 ప్లాట్లు, పారిశ్రామికంగా అత్యంత కీలకమైన గాజువాక ఆటోనగర్‌లోని బ్లాక్- 2లోని 2,728 చ.గజాలు, బ్లాక్--3లోని 2894.44 చ.గజాల్లో ఉన్న రూ.19.75 కోట్లు విలువైన ప్లాట్లను వేలంలో చేర్చారు.

అక్టోబర్ 12వతేదీన 243 ప్లాట్లకు, 16వతేదీన 216 ప్లాట్లకు సంబంధించిన వేలం విక్రయం జరగనుంది. వేలంలో పాల్గొనేవారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) మిగులు ఆస్తుల నగదీకరణలో భాగంగా 2022 జూన్‌లో ఆర్థిక శాఖ పరిధిలో ఏర్పాటైన ఎన్ఎల్ఎంసీ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తోంది. సీపీఎస్ఈల వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణలో సహాయపడటం దీని ముఖ్య ఉద్దేశం.

**ప్యాకేజీలతో మభ్యపుచ్చి నిర్వీర్యం చేసే కుట్ర**

ఆర్ఐఎన్ఎల్ ఆధీనంలో ఉన్న సుమారు 19 వేల ఎకరాలకుపైగా భూముల్లో అత్యంత విలువైన వాణిజ్య స్థలాలను ముందుగా అమ్మకానికి పెట్టి సంస్థను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర మొదలైందని ఉద్యోగ, కార్మిక సంఘాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్యాకేజీల పేరుతో మభ్యపుచ్చి ఎన్ఎల్ఎంసీ ద్వారా భూముల విక్రయానికి తెర తీశారని మండిపడుతున్నారు.

**నాడు గట్టిగా అడ్డుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం**

ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తే ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. 2021 జనవరిలో స్టీల్‌ప్లాంట్‌లో వంద శాతం వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపగా నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దీన్ని గట్టిగా వ్యతిరేకించి అడ్డుకుంది. దీనిపై కార్మికులు, ప్రజా సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తడంతో అడుగులు ముందుకు పడలేదు.

అంతేకాకుండా ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం జీవీఎంసీ కౌన్సిల్‌లో, అసెంబ్లీలో తీర్మానాలు ప్రవేశ పెట్టింది. దీంతో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రైవేటీకరణ ప్రక్రియకు అడ్డుకట్ట పడింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడుగులు వేగంగా పడ్డాయి. రాజకీయ సమీకరణాల నేపథ్యంలో 2025 జనవరిలో కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల పునరుద్ధరణ ప్యాకేజీని ప్రకటించింది. దీన్ని రుణాల చెల్లింపులు, పాత బకాయిల కోసం వినియోగించడంతో ప్లాంట్ అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడలేదు.

**సొంత గనులు కేటాయించి ఉంటే..** కర్మాగారానికి సొంత గనులు కేటాయించకపోవడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్ తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందన్నది ఎవరూ కాదనలేని సత్యం. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం స్టీల్‌ప్లాంట్‌పై మొసలి కన్నీళ్లు కార్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తీసుకున్న చర్యలు శూన్యం. వైజాగ్ స్టీల్‌కు సొంతగనులు ఇవ్వకుండా.. ఓ ప్రైవేట్ సంస్థకు కేటాయించేలా తన పరపతి వినియోగించారు. ముడిసరుకు కొనుగోలు భారం మోయలేక, మూలధనం కొరతతో విశాఖ స్టీల్ ప్లాంట్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీన్ని సాకుగా చూపిస్తూ ప్లాంట్‌కు చెందిన విలువైన స్థలాలను మిగులు, వృథా ఆస్తుల పేరుతో విక్రయించడం వ్యూహాత్మక కుట్రలో భాగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

# ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం.. ఏడుగురు మృతి



**న్యూఢిల్లీ:** దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర విలయాన్ని సృష్టిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో కుండపోత వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఏడుగురు మృతి చెందారు. కొండచరియల ధాటికి రాష్ట్రవ్యాప్తంగా 172కు పైగా రహదారులు మూతపడ్డాయి. ఇందులో పితోరాగఢ్, నైనితాల్, బాగేశ్వర్‌లను కలిపే జాతీయ రహదారులు కూడా ఉన్నాయి. బాగేశ్వర్‌లో ఎన్‌హెచ్-109 సహా 16 మార్గాలు స్తంభించడంతో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు భారీగా నిలిచిపోయాయి. గౌలా, కోసి, క్షిప్రా, బిన్ నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

హల్ద్వానీ సమీపంలోని గౌలా నది నుంచి సుమారు 27 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. పౌడీ జిల్లా కోట్‌ద్వార్ సమీపంలో కొల్హు నదిని దాటుతూ తల్లి, ఏడాదిన్నర చిన్నారి కొట్టుకుపోయి మరణించారు. అల్మోరా జిల్లా ఉదయ్‌ఉడా గ్రామంలో ఇళ్లపైకి శిథిలాలు విరుచుకుపడటంతో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి మృతి చెందగా, ధార్ ప్రాంతంలో మరో ఇద్దరు నేపాలీ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. రుతుపవనాల తీవ్రత దృష్ట్యా నైనితాల్, చంపావత్, ఉధమ్ సింగ్ నగర్, పితోరాగఢ్ జిల్లాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీలకు సెలవులు ప్రకటించారు. వర్షాల కారణంగా సోన్‌ప్రయాగ్ వద్ద కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు.

మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో గంగా, మందాకిని నదుల ఉధృతితో వరద ముప్పు తీవ్రమైంది. సీతాపూర్‌లో గోడ కూలి ఇద్దరు మృతి చెందగా, ఘాజీపూర్‌లో ఇద్దరు బాలికలు గంగలో కొట్టుకుపోయారు. బలియాలో గంగానది ప్రమాద స్థాయికి 1.60 మీటర్ల ఎగువన ప్రవహిస్తుండటంతో 20 వేల మంది నిరాశ్రయులయ్యారు. వారణాసిలో మణికర్ణిక, హరిశ్చంద్ర ఘాట్‌లు మునిగిపోవడంతో అంత్యక్రియలను సమీప భవనాల డాబాలు, వీధుల్లో నిర్వహిస్తున్నారు. చిత్రకూట్‌లో మందాకిని నది ప్రమాద స్థాయిని దాటి 4 మీటర్ల మేర ప్రవహిస్తోంది. అటు ఝార్ఖండ్‌లోని గర్హ్వా, పలాము, సిమ్‌డేగా సహా 10 జిల్లాలకు వాతావరణ శాఖ ఆకస్మిక వరదల (ఫ్లాష్ ఫ్లడ్) హెచ్చరికలు జారీ చేసింది.

## రాజకీయాల్లో మార్పు కోసమే జనసేన యువజన విభాగం

**పిఠాపురం :** జనసేన పార్టీ రాష్ట్ర యువజన విభాగం సెప్టెంబర్ 2న పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆవిష్కృతమవుతోంది. రాజకీయాల్లో మార్పుకోసం 'దేశమే ఫస్ట్' నినాదంతో యువత బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. మంగళవారం ఆయన పిఠాపురంలో పర్యటించి, యువజన విభాగం ఆవిష్కరణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోనే యువజన విభాగం ఆవిష్కరణ జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆవిష్కరణ ఉత్సవాలను పార్టీశ్రేణులు నిర్వహిస్తాయని తెలిపారు. మంత్రి వెంట కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే దొరబాబు, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సత్య, పౌరసరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్ సుధీర్ ఉన్నారు.

## 10 వేల మందిపై ఒరాకిల్ వేటు?

**న్యూఢిల్లీ :** అమెరికన్ టెక్ దిగ్గజం ఒరాకిల్ భారీ స్థాయిలో ఉద్యోగులపై వేటుకు సన్నద్ధమవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10,000 మంది ఉద్యోగులను తొలగించాలని ఒరాకిల్ యోచిస్తున్నది. దీని ప్రభావం భారత్‌లోని వందలాది మంది ఉద్యోగులపై కూడా పడే అవకాశం ఉంది.

క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మౌలిక సదుపాయాలకు పెరుగుతున్న వ్యయాన్ని సమతుల్యం చేసుకునేందుకు, ఖర్చులను తగ్గించుకునేందుకు కంపెనీ ఈ చర్య తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. తమ ఖర్చులను తగ్గించుకునే మార్గాలను అన్వేషించాలని ఒరాకిల్ యాజమాన్యం తన వివిధ బృందాలను కోరింది. ఈ నిర్ణయం కారణంగా ఉద్యోగుల తొలగింపు ప్రభావం కేవలం ఒక నిర్దిష్ట వ్యాపార విభాగానికే పరిమితం కాకుండా కంపెనీలోని అనేక విభాగాలపై పడే అవకాశం ఉంది. కంపెనీ అంతర్గత చర్చల ప్రకారం ఈ తొలగింపుల వల్ల ప్రపంచవ్యాప్తంగా 7,000 నుంచి 10,000 మంది ఉద్యోగులు ప్రభావితం కావచ్చని అంచనా. అయితే, ఒరాకిల్ నుంచి ఈ లెక్కలకు సంబంధించి అధికారిక ధృవీకరణ ఇంకా వెలువడాల్సి ఉంది.

తొలగింపు ప్రక్రియకు సంబంధించిన చర్చలు కంపెనీ ఉద్యోగుల మధ్య జోరుగా సాగుతున్నాయి. ఉద్యోగుల తొలగింపు ప్రకటన సెప్టెంబర్ 1న వెలువడుతుందని భావించినప్పటికీ ఇప్పుడు సెప్టెంబర్ 15న కంపెనీ తన తొలగింపు నిర్ణయాలను ప్రకటించవచ్చని ఉద్యోగులు భావిస్తున్నారు. ప్రస్తుతం, ఉద్యోగ తొలగింపుల కచ్చితమైన తేదీ, ప్రభావితమయ్యే ఉద్యోగుల తుది సంఖ్యపై అనిశ్చితి నెలకొని ఉంది. ఏయే స్థాయి ఉద్యోగులను తొలగిస్తారనే విషయంపై చాలా మంది మేనేజర్లకు కూడా ఇంకా పూర్తి అవగాహన లేదు.

ఉద్యోగాల తొలగింపునకు సంబంధించిన ఈ నిర్ణయం ఒరాకిల్‌లోని భారతీయ ఉద్యోగులకు అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. భారత్‌లో దాదాపు 3 వేల మందిని తొలగించే అవకాశం ఉన్నది ఒరాకిల్‌కు చెందిన ప్రపంచవ్యాప్తం కార్యకలాపాలకు భారత్ ఒక పెద్ద, ముఖ్యమైన కేంద్రంగా ఉంది. ఇక్కడ ఇంజనీరింగ్, క్లౌడ్ సేవలు, టెక్నాలజీ, సపోర్ట్ విభాగాల్లో ప్రధాన బృందాలు పనిచేస్తాయి. దీంతో కోతల్లో అధిక భాగం భారతీయ ఉద్యోగులపై ప్రభావం చూపొచ్చని భావిస్తున్నారు.

దేశంలో ఒరాకిల్ ఉద్యోగులు ఉద్యోగాల కోతపై అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ కూడా ఉద్యోగుల పనితీరును సమీక్షించే ప్రక్రియను చేపట్టింది. ఈ చర్య సంస్థలోని కొంతమంది ఉద్యోగుల్లో ఆందోళనలు రేకెత్తించింది. భారత్‌లో మైక్రోసాఫ్ట్‌కు చెందిన దాదాపు 500 మంది ఉద్యోగులను పర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్స్(పీఐపీ)లో ఉంచినట్లు సమాచారం. ఈ పరిణామం ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో ఉద్యోగ భద్రతపై ఇప్పటికే ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రభావిత ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. అయితే మైక్రోసాఫ్ట్ మాత్రం పీఐపీలు సంస్థలో సాధారణ ఉద్యోగుల నిర్వహణలో భాగమే తప్ప అవి తప్పనిసరిగా ఉద్యోగాల తొలగింపుతో సంబంధం కలిగి ఉండవని స్పష్టం చేసింది.

దీనిపై మైక్రోసాఫ్ట్ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ సంస్థలో పీఐపీతోపాటు గ్లోబల్ వాలంటరీ సెపరేషన్ అగ్రిమెంట్స్ కోసం కూడా అధికారిక విధానాలు ఉన్నాయని చెప్పారు. ఉద్యోగులు తమ బాధ్యతలకు సంబంధించిన పనితీరు ప్రమాణాలను చేరుకోలేకపోతే వారికి అదనపు శిక్షణ, మార్గదర్శకత్వం అందించవచ్చని, లేదా వారిని పీఐపీలో ఉంచవచ్చని కంపెనీ తెలిపింది. పరిస్థితిని బట్టి అలాంటి ఉద్యోగులకు స్వచ్ఛందంగా ఉద్యోగం నుంచి వైదొలగే అవకాశం కూడా ఉండవచ్చని, లేదంటే ఉద్యోగం నుంచి తొలగించే పరిస్థితి ఏర్పడవచ్చని సంస్థ పేర్కొంది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో పీఐపీలకు గురయ్యే వారి సంఖ్య చాలా స్వల్ప శాతం మాత్రమేనని కంపెనీ తెలిపింది. అయితే, వ్యక్తిగత ఉద్యోగులకు సంబంధించిన వివరాలను గానీ, భారత్‌లో లేదా ఇతర ప్రాంతాల్లో పీఐపీలకు గురైన ఉద్యోగుల సంఖ్యకు సంబంధించిన ప్రాంతాల వారీ వివరాలను గానీ మైక్రోసాఫ్ట్ వెల్లడించలేదు.

## కొత్త ప్రపంచపటానికి అనుకూలంగా ఓటేసిన భారత్

**సత్తెనపల్లి న్యూస్** : నూతనంగా రూపొందించిన ప్రపంచ పటానికి భారత్ అనుకూలంగా ఓటేసింది. ఐక్యరాజ్యసమితిలో 'కరెక్ట్ ద మ్యాప్' పేరుతో నూతన ప్రపంచ పటానికి మద్దతుగా సెప్టెంబర్ 4న ప్రవేశపెట్టిన తీర్మానానికి ఇండియా అనుకూలంగా ఓటేసింది. ఈ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో ఇండియా అధికారికంగా ప్రకటించిన పటంలో ఉన్నట్లుగానే జమ్మూ కాశ్మీర్, లదాఖ్ ప్రాంతాలు ఇండియాలోనే ఉండేలా చూడాలని ఐక్యరాజ్యసమితిని హెచ్చరించింది. నూతన ప్రపంచ పటంలో ఈ ప్రాంతాలను తప్పుగా చూపించినా, సరిగ్గా లేకున్నా సహించబోమని ఐరాసకు వార్నింగ్ ఇచ్చింది. తాజా ప్రపంచ పటం ఒక దేశ జాతీయ సరిహద్దుల్ని నిర్ణయించలేదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ప్రకటించారు. అంటే, ఇండియా సరిహద్దులతోపాటు ఏ దేశ సరిహద్దులు కూడా మారవు. అయితే, ఇండియాలో కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూ కాశ్మీర్, లదాఖ్ ప్రాంతాలను తప్పుగా చూపించకూడదని కూడా ఆయన అన్నారు. ఐరాసలో ఈ తీర్మానాన్ని 193 సభ్య దేశాలకుగాను.. హాజరైన 164 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. ఒక్క అమెరికా మాత్రమే ఈ ప్రపంచ పటాన్ని వ్యతిరేకిస్తోంది. కారణం.. కొత్త ప్రపంచ పటంలో అమెరికా కాస్త చిన్నగా కనిపించబోతుండటమే. అలాగే, ఇండియాతోపాటు ఆఫ్రికా ఖండం కాస్త పెద్దగా కనిపించబోతుంది.

## పట్టాలు తప్పిన మహానంద ఎక్స్‌ప్రెస్

**పాట్నా:** సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వల్ల మహానంద ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, రెండు బోగీలు పట్టాలు తప్పాయి. రైల్వే అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సంఘటన వల్ల ఆ రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 15483 అలీపుర్దువార్ జంక్షన్-ఢిల్లీ సిక్కిం మహానంద ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 4.12 గంటలకు బీహార్‌లోని ఆరా రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ రెండుకు చేరుకున్నది. కాగా, ఢిల్లీ వెళ్లాల్సిన ఆ రైలు స్టేషన్ నుంచి బయలుదేరిన సమయంలో సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య వచ్చింది. దీంతో సాధారణ అప్ లైన్ వైపు సిగ్నల్ చూపించడంతో ఆ రైలు ముందుకు కదిలింది. అయితే స్టేషన్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో అది పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, ఎస్-ఎల్ఆర్, హెచ్-1 కోచ్ చక్రాలు పట్టాలు తప్పాయి. ఈ సంఘటన వల్ల ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మరోవైపు ఈ సమాచారం తెలిసిన వెంటనే రైల్వే అధికారులు, సాంకేతిక బృందాలు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పట్టాలు తప్పిన రైలు ఇంజిన్, బోగీలను ట్రాక్‌పైకి ఎక్కించే పునరుద్ధరణ పనులు చేపట్టారు. సాధారణ లైన్ వైపు సిగ్నల్ మళ్లడానికి దారితీసిన పరిస్థితులు, ఆ రైలు తప్పుడు దిశలో ఎలా ప్రయాణించిందనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే అధికారులు తెలిపారు.

## ఢిల్లీలో కుప్పకూలిన భవనం

**సత్తెనపల్లి న్యూస్** : దేశ రాజధాని ఢిల్లీలో ఘోర ప్రమాదం జరిగింది. ఒక భవనం కుప్పకూలడంతో, ఆ శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో, ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే ఢిల్లీ ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. బిల్డింగ్ శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఆ శిథిలాల కింద ఎంతమంది ఉన్నారు అనే విషయంలో స్పష్టత లేదు. ప్రాథమిక అంచనా ప్రకారం శిథిలాల కింద పదుగురు ఉండొచ్చని అనుమానిస్తున్నారు. బిల్డింగ్ కూలడానికి గల కారణాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. కొద్ది రోజులుగా ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తిన సంగతి తెలిసిందే. వర్షాలు కూడా బిల్డింగ్ కూలడానికి ఒక కారణం అయ్యుండొచ్చని అంచనా. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతాయి. ఘటనా స్థలంలో అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు సిద్ధంగా ఉన్నాయి. ఘటన జరిగిన ప్రదేశం ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు దగ్గర్లో ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న పలువురు విద్యార్థులు కూడా సహాయక చర్యల్లో సాయం అందిస్తున్నారు.

## వైజాగ్ జూకు కొత్త జంతువుల రాక..!

**సత్తెనపల్లి న్యూస్** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల కొత్త కళను సంతరించుకుంది. సందర్శకులను మరింత ఆకట్టుకునేందుకు గుజరాత్ నుంచి అరుదైన, విదేశీ జంతువులు ఇక్కడికి చేరుకున్నాయి. జంతు మార్పిడి విధానంలో భాగంగా జీబ్రాలు, రెడ్ నెక్డ్ వాలీ లతో పాటు ప్రత్యేకమైన కోతి జాతులను విశాఖకు తీసుకొచ్చారు. ఈ కొత్త జీవుల రాకతో జూలో సందడి వాతావరణం నెలకొంది. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి ఈ కొత్త జీవాలను విశాఖకు తీసుకొచ్చినట్లు జూ క్యూరేటర్ జి మంగమ్మ తెలిపారు. వచ్చిన వాటిలో ఒక మగ, రెండు ఆడ జీబ్రాలు.. ఒక మగ, రెండు ఆడ రెడ్ నెక్డ్ వాలీలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వీటితోపాటు రెండు జతల కాటన్ టాప్ టామరిన్ కోతులు, ఒక మగ, రెండు ఆడ కామన్ మార్మోసెట్ కోతులు కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ మార్పిడిలో భాగంగా విశాఖ జూ నుంచి ఒక జత ఇండియన్ గౌర్ (అడవి దున్న), రెండు జతల స్టంప్ టైల్డ్ మకావ్ కోతులు, ఒక జత ఘరియల్ మొసళ్లను గుజరాత్‌కు పంపించారు. వెటర్నరీ అధికారుల పర్యవేక్షణలో ఈ జంతువులను సురక్షితంగా విశాఖకు చేర్చామని, ప్రస్తుతం వీటిని క్వారంటైన్‌లో ఉంచామని మంగమ్మ తెలిపారు. క్వారంటైన్ గడువు ముగిసిన తర్వాత సందర్శకుల వీక్షణ కోసం వాటికి కేటాయించిన ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లలోకి విడుదల చేస్తామని వెల్లడించారు. ఇదిలావుండగా ఇటీవలి కాలంలో విశాఖ జూలో జంతు సంపద గణనీయంగా పెరిగింది. 12 రకాల జాతులకు చెందిన మొత్తం 128 కొత్త జీవాలు జన్మించినట్లు అటవీ శాఖ అధికారికంగా ప్రకటించింది. వీటిలో 40 స్టార్ తాబేళ్లు, 35 అడవి పందులు, 20 చుక్కల జింకలు, సాంబార్ జింకలు, హైనాలు, బైసన్‌లు వంటివి ఉన్నాయి. ఈ పరిణామంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హర్షం వ్యక్తంచేశారు. ఈ కొత్త జంతువుల రాక, ఇటీవల జన్మించిన జీవాలతో విశాఖ జూ సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచనుంది.

## జేఎన్‌యూలో లైంగిక వేధింపులు..

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో లైంగిక వేధింపుల ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. ఒక ప్రొఫెసర్ తమను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు 10 మంది విద్యార్థినులు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ వద్ద విద్యార్థినులు ఫిర్యాదు చేయగా.. విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదు ప్రకారం.. ఒక ప్రొఫెసర్ తన విద్యార్థినుల్ని ప్రైవేట్ మీటింగ్ కోసం తన ఇంటికి రమ్మని పిలిచేవాడు. అలాగే, అక్కడ విద్యార్థినులతో అభ్యంతరకరంగా ప్రవర్తించేవాడు. క్లాస్ రూంలో పాఠాలు చెబుతున్నప్పుడు కూడా అసభ్యకరమైన మాటలు మాట్లాడేవాడు. దీంతో ఈ వేధింపులను కొంతకాలం భరించిన విద్యార్థినులు నెల రోజుల క్రితమే ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ప్రస్తుతం యూనివర్సిటీ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేశారా.. లేదా అనే విషయాలు తెలియవు.

# కరుగుతున్న హిమాలయాలు!



**న్యూఢిల్లీ:** ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడానికి ప్రతి సంవత్సరం ప్రయత్నించే పర్వతారోహకుల మూత్రం, ప్రతి క్లైంబింగ్ సీజన్‌లో టన్నుల కొద్దీ మంచును కరిగిస్తున్నదని పరిశోధనలు గుర్తించాయి. ఖుంబు హిమానీనదంపై ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ఏర్పాటు చేస్తుంటారు. కిచెన్లు, షవర్లు, జనరేటర్లు, వై-ఫై, కొన్ని సందర్భాల్లో వేడిచేసే ఫ్లోర్‌లు వంటి ప్రాథమిక సౌకర్యాలతో కూడిన దాదాపు 1,600 గుడారాలు ప్రతి సంవత్సరం ఈ హిమనీనదంపై వెలుస్తాయి. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే వేడి నేల ఉష్ణోగ్రత పెరగడానికి కారణమవుతున్నది. 'రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ చేంజ్' జర్నల్‌లో నేపాల్, అమెరికన్ శాస్త్రవేత్తల బృందం ప్రచురించిన ఒక అధ్యయనం, ఈ మానవ కార్యకలాపాలు హిమానీనదాన్ని ఏ విధంగా కరిగిస్తున్నాయో, విపత్తుకు ఎలా బాటలు వేస్తున్నాయో చెప్తున్నది. 26 ఆగస్టు 2026న నేపాల్‌ను ఒక భారీ ఆకస్మిక వరద వణికించింది. ఇది గ్రామాలను కొట్టుకుపోయేలా చేసి 1,200 మందికిపైగా ప్రజలను పొట్టనబెట్టుకున్నది.

ఈ విపత్తు మంచు సరస్సు పగలడం వల్ల సంభవించిందని తేలింది. గ్లోబల్ వార్మింగ్, శిలాజ ఇంధనాల వాడకంతోపాటు, మానవ మూత్ర విసర్జన కూడా హిమానీనదం కరుగడానికి ఎలా కారణమవుతున్నదో ఈ కొత్త అధ్యయనం దృష్టి సారించింది. ఎక్కువ ఎత్తులో ఉండటం వల్ల పర్వతారోకులు ఎక్కువ నీరు తాగాల్సి వస్తున్నది. దీనివల్ల వారు ఎక్కువ మూత్ర విసర్జన చేస్తారు. పరిశోధకుల ప్రకారం.. 2023 సీజన్‌లో రోజుకు దాదాపు 6,766 లీటర్ల మూత్రం ఉత్పత్తి అయింది. మూత్రం ఒక్కటే చాలా వేడిని కలిగి ఉంటుందని, ఇది హిమానీనదం గణనీయంగా కరుగడానికి సరిపోతుందని తేలింది. ఆ వేడి పరిమాణం ఎంత మంచును కరిగిస్తున్నదో అంచనా వేస్తూ, ఆ ఒక్క క్లైంబింగ్ సీజన్‌లోనే హిమానీనదం 154 టన్నుల మంచును కోల్పోయిందని పరిశోధకులు తెలిపారు. మూత్రం కంటే పెద్ద సమస్య బేస్ క్యాంప్‌లో ఇంధన వినియోగం. 2023 సీజన్‌లో వంట, వేడి, విద్యుత్తు కోసం 824 ఎల్పీజీ సిలిండర్లు, 18,935 లీటర్ల కిరోసిన్, 5,130 లీటర్ల గ్యాసోలిన్ ఉపయోగించారు. మానవుల వల్ల జరిగే కరుగుదలలో ఇది దాదాపు 94 శాతం.

## ఇస్రోను ప్రైవేట్‌పరం చేస్తారా?.. సంస్థ ఉద్యోగుల్లో ఆందోళన



**బెంగళూరు** : బంగారు బాతుల్లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్న కేంద్రంలోని మోదీ సర్కార్.. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కార్యకలాపాలను ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నది. దీనిపై ఇస్రో ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆరేండ్ల క్రితం ప్రభుత్వం భారత అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ పరిశ్రమలకు అందుబాటులోకి తీసుకురావడం ప్రారంభించినప్పటి నుంచి మొదటిసారిగా అంతరిక్ష శాఖ(డీఓఎస్) పరిధిలోని ఇస్రో కేంద్రాలకు చెందిన వేలాదిమంది సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న 9 ఉద్యోగ సంఘాలు ఈ మార్పు దిశ, ప్రాతిపదికపై అధికారికంగా తమ ఆందోళనను వ్యక్తం చేశాయి.

డీవోఎస్ కార్యదర్శిగా, ఇస్రో చైర్మన్‌గా వ్యవహరిస్తున్న స్పేస్ కమిషన్ చైర్మన్ నుంచి ఈ సంఘాలు లిఖితపూర్వక వివరణ కోరాయి. పటిష్టమైన ప్రభుత్వ యాజమాన్యంలోని ఇస్రోతోపాటుగా నిర్దిష్ట వాణిజ్య కార్యకలాపాలలో ప్రైవేట్ భాగస్వామ్యం కొనసాగగలదు. దేశ ప్రయోగ వాహక నౌకల రూపకల్పన, దాని ప్రయోగ మౌలిక సదుపాయాల నిర్వహణ ప్రభుత్వ చేతుల నుంచి జారిపోతుండగా ఇస్రోను కేవలం నామమాత్రపు ఆర్అండ్‌డీ విభాగానికి పరిమితం చేసే విధానాన్ని చర్చ లేకుండా అంగీకరించలేము అని సెప్టెంబర్ 4న రాసిన వినతిపత్రంలో సంఘాలు పేర్కొన్నాయి.

ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతికతను జాతీయ ఆస్తిగా అభివర్ణిస్తూ దాని బదిలీ పారదర్శకంగా, జవాబుదారీగా ఉండాలని, అలాగే వ్యూహాత్మక, భద్రత, ఉపాధిపరమైన అంశాలకు అనుగుణంగా ఉండాలని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఉద్యోగులకు సమాచారం తెలుసుకునే, సంప్రదించే , రక్షణ పొందే అర్హత ఉందని, సహజ న్యాయం, సుపరిపాలన ప్రకారం ఇంతటి ప్రాముఖ్యత గల విధానాన్ని సంబంధిత శాఖే స్వయంగా ఉద్యోగులకు వివరించాలని వినతిపత్రం పేర్కొంది.

ఇస్రో భవిష్యత్తులో ఎటువంటి ప్రయోగ వాహనాలను తయారు చేయదని ఇన్-స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా ఇటీవల చేసినట్టుగా చెబుతున్న బహిరంగ ప్రకటనను ప్రస్తావిస్తూ ఆ ప్రకటన భారత ప్రభుత్వం, అంతరిక్ష కమిషన్ లేదా డీవోఎస్ ఆమోదించిన నిర్ణయానికి ప్రతిరూపమా? ఒకవేళ ఆమోదించి ఉంటే ఆ విధానపరమైన నిర్ణయానికి సంబంధించిన తేదీ, అధికారం, పాత్యాన్ని దయచేసి తెలియచేయగలరు అని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. పన్ను చెల్లింపుదారుల నిధులు, తరతరాలుగా ఇస్రో ఉద్యోగుల శ్రమతో రూపొందించిన సాంకేతికత, పరీక్షా కేంద్రాలు, ప్రయోగ కేంద్రాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటిని ప్రైవేట్ నిర్వహణకు బదిలీ చేయడం లేదా అందుబాటులో ఉంచడం ఏ సంస్థాగత ఏర్పాట్ల కింద జరుగుతున్నదో, అలాగే అటువంటి బదిలీల్లో ఎన్-స్పేస్‌తో పోలిస్తే ఎన్ఎస్ఐఎల్ పాత్ర ఏమిటో కూడా లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. ప్రయోగ వాహనాలు, ఉపగ్రహాల రూపకల్పన నుంచి ఇస్రో క్రమంగా వైదొలగడం వల్ల పరిశోధన అనంతర ప్రయోగాలు దెబ్బతింటాయని, అంతర్గత పనులు తగ్గిపోయి మంజూరైన సిబ్బంది సంఖ్యను స్తంభింపచేయడం లేదా తగ్గించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే సాంకేతిక, శాస్త్రీయ, పరిపాలన, స్టోర్స్, కొనుగోలు, నాణ్యత, భద్రత, పదోన్నతులు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు మూసుకుపోతాయని ఆందోళన చెందుతున్నట్టు ఉద్యోగ సంఘాలు తమ వినతిపత్రంలో పేర్కొన్నాయి.

## విద్యార్థులకు ఉపాధ్యాయులే స్ఫూర్తి

**నరసరావుపేట** : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ కృతికా శుక్లా, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖాధికారులు పాల్గొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 70 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రుల త్యాగంతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకం కీలకమని తెలిపారు. విద్యార్థుల్లో జ్ఞాన వికాసంతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మానవీయత వంటి సద్గుణాలు పెంపొందిస్తూ వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అభిప్రాయపడ్డారు. ప్రతిభ గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణతను 95 శాతం వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీఈ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రతిభ గల విద్యార్థులను నగదు బహుమతితో ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర శిల్పారామం, సాంస్కృతిక విభాగం సంస్థ చైర్మన్ చేరెడ్డి మంజులారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ పి.శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## భావితరాలకు గురువులే మార్గదర్శకులు

**గుంటూరు** : భావితరాలను సన్మార్గంలో నడిపే బాధ్యత గురువులపైనే ఉందని జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. విలువలతో కూడిన సమాజాన్ని నెలకొల్పడమే ధ్యేయం కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు విలువలు నేర్పాలన్నారు. ఇది సమాజానికి గొప్ప పెట్టుబడి కాగలదని పేర్కొన్నారు. విలువలు అనే పునాదిపై సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఇది ఉపాధ్యాయుల చేతిలో ఉందని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, మంచి సమాజ నిర్మాణంలో వారు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలలో ఉంటారని, వారిని చక్కగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. మంచి నాయకత్వ లక్షణాలు అందించాలని సూచించారు. విద్యార్థులు అనుకున్నది సాధించే వరకు కృషి చేసేలా ప్రేరణ కల్పించాలన్నారు. ఒత్తిడిని, ఓటమిని తట్టుకునే శక్తి కలిగి ఉండే విధంగా విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. గాంధీ స్వాతంత్ర్య సంగ్రామంలో ఎటువంటి కమ్యూనికేషన్ వ్యవస్థ లేని రోజుల్లోనే యావత్తు దేశాన్ని మమేకం చేశారన్నారు. భావితరాలకు ఏం కావాలో ఆలోచించి, అందుకు అవసరమైన మెట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఆచార్యుడిగా, తత్వవేత్తగా నిలిచారని తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు, కష్టపడి పనిచేసే వారు ఉన్నారని పేర్కొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**నరసరావుపేట** : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని బరంపేటలోని శ్రీ రాధా గోవింద చంద్రమందిరం (ఇస్కాన్) హరే కృష్ణ నామస్మరణతో మారుమోగింది. ఆలయాన్ని పూలమాలలతో అలంకరించి, రంగవల్లులు తీర్చిదిద్దారు. తెల్లవారుజామున 4.30 గంటలకు శ్రీ రాధా గోవిందులకు శుభమంగళ హారతి సమర్పించారు. అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలతో ఉదయం 8.30 గంటలకు శుభదర్శన హారతితో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీమద్భాగవత ప్రవచనం, మహా హరినామ సంకీర్తనలతో ఆలయం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తల్లిదండ్రులు తమ చిన్నారులకు రాధాకృష్ణుల అలంకరణ చేసి ఆలయానికి తీసుకువచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉట్లోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. రాత్రి ఉత్సవమూర్తులకు 56 రకాల ద్రవ్యాలతో మహాశంఖాభిషేకం, 108 రకాల భక్ష్యాలతో మహారాజభోగ నివేదన నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏకాదశి ప్రసాద వితరణ గావించారు.

## సర్‌పై 10 వరకు అభ్యంతరాల స్వీకరణ

**నరసరావుపేట** : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ఈనెల 10వ తేదీ వరకు స్వీకరించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇప్పటికే సర్ ముసాదాను అగస్ట్ 31వ తేదీన విడుదల చేసినట్లు తెలిపారు. ముసాదా ఓటరు జాబితా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యంతరాలను స్వీకరించేందుకు ఈనెల 5, 6 (శని, ఆదివారం) తేదీలను ప్రత్యేక ప్రచార దినాలుగా ప్రకటించి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధులు తమ బూత్ లెవల్ ఏజెంట్లను హాజరయ్యేలా చూసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు అవసరమైన పత్రాలు బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువ ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్వాతంత్ర్య సమరయోధుల వారసుల ఇళ్ల నిర్మాణాలు నిలిపివేత

**గుంటూరు రూరల్:** స్వాతంత్ర్య సమరయోధుల వారసులు చేపట్టిన ఇంటి నిర్మాణాలను అధికారులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ చర్యను లబ్ధిదారులు తీవ్రంగా ప్రతిఘటించారు. వివరాలు.. అడవితక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు 2010లో అప్పటి ఉన్నతాధికారులు సుమారు 70--80 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. అదే స్థలాలు గతంలో 1985లో వేరే వారికి కేటాయించగా వాళ్లు ఆ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవటంతో 2010లో ఉన్నతాధికారులు విచారించి గతంలో 1985లో ఇచ్చిన వారికి రద్దు చేసి 2010లో స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించి ఇళ్ల పట్టాలను మంజూరు చేసి అందజేశారు. అప్పటి నుంచి కొందరు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టి వదిలేయగా మిగిలిన వారు అక్కడ ఎటువంటి మౌలిక వసుతులు లేకపోవటంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోయారు.

## కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి




**సత్తెనపల్లి న్యూస్, బాపట్ల** : నియోజకవర్గ కేంద్రమైన పర్చూరు గ్రామములో శనివారం జాతీయ కాంగ్రెస్ పార్టీ సమావేశం పర్చూరు ఇంచార్జి శివ జ్యోతి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ కేంద్ర మంత్రి జె. డి శీలం మాట్లాడుతూ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని చెప్పారు. అదే విధంగా పార్టీ అన్ని కమిటీలను నియమించి ఓటర్లకు అండగా ఉండాలి అని చెప్పారు. సమావేశంలో మండలాకు బాధ్యలును నియమించారు. కారంచేడు అధ్యక్షుడు పెరి రెడ్డి, జిల్లా కమిటీ ఆనందరావు, యూత్ సెల్ డేనియల్ యస్. సి సెల్ యాకోబు, పాస్టర్స్ యూనియన్ ఏసోబు, కూరాకుల ప్రసాద్, ఖలీద్, శాంసన్, చిన్నగాంజాం పౌల్, తేజ, మహిళా విభాగం పద్మ, మైనార్టీ సుభాని, రమేష్, మార్టూరు మైనార్టీ సెల్ నాగూర్, యద్దనపూడి శ్యామ్, లను నియమించడం జరిగింది.కార్యక్రమంలో పి. సి. సి జనరల్ సెక్రటరీ అంజి బాబు, బాపట్ల జిల్లా కోర్డినేటర్ పాల్ విజయ్ కుమార్,జనరల్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, బాపట్ల జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు సంపత్ కుమార్, పులిపాటి రవి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెనక్కు తిప్పలేని స్థాయికి భూతాపం

**న్యూఢిల్లీ:** భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలని పారిస్ వాతావరణ సదస్సు 2015లో తీర్మానించినా, రానున్న కొద్ది సంవత్సరాలలో తాత్కాలికంగానైనా భూఉష్ణోగ్రత ఈ పరిమితిని దాటనున్నది. ఐక్యరాజ్యసమితి పర్యావరణ సంస్థ (యూఎన్ఈపీ) విడుదల చేసిన నివేదిక- కర్బన ఉద్గారాలను వెంటనే తగ్గించాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. ఉష్ణోగ్రత పెరుగుదల 1.5 డిగ్రీలు మించితే వాతావరణ వైపరీత్యాలు తీవ్రతరమవుతాయని, పర్యావరణ వ్యవస్థలు తీరని నష్టానికి గురవుతాయని, సముద్ర మట్టాలు పెరిగి చిన్న ద్వీప దేశాలు నీట మునిగిపోతాయని హెచ్చరించింది. 50 ఏళ్ల సాంకేతిక పురోగతి కూడా వాతావరణ మార్పులను తిప్పికొట్టలేదని, పరిస్థితులు సాధారణ స్థితికి రాకపోవచ్చని సంస్థ భారత విభాగాధిపతి బాలకృష్ణ పిశుపాటి హెచ్చరించారు. "అధిక జనసాంద్రత, ఆదాయ అసమానత, సాంకేతిక, ఆర్థిక ఫలాల పంపిణీలో అసమానత వల్ల దక్షిణాసియా భూతాప ప్రభావాలను ఎక్కువగా ఎదుర్కొంటోంది. హిమానీనదాలు, సముద్ర మట్టాల పెరుగుదల, జీవ వైవిధ్య నష్టం వంటివి చాలావరకు శాశ్వతమైనవని, వాటిని వెనక్కు తిప్పడం అసాధ్యం. ఉష్ణోగ్రతలు తగ్గినా హిమానీనదాలు వెంటనే సాధారణ స్థితికి తిరిగిరావు. ఉష్ణోగ్రతను 1.5 డిగ్రీలకు పరిమితం చేసినప్పటికీ, సముద్ర మట్టాల్లో పెరుగుదలను దశాబ్దంలోగా తిప్పికొట్టడం అసాధ్యం. జీవవైవిధ్య నష్టం శాశ్వతమైనది. ఒక జాతి అంతరించిపోతే దాన్ని సహజ పరిస్థితుల్లో పునరుద్ధరించలేం" అని పిశుపాటి వివరించారు.

## హిమాచల్‌లో ఆర్ఎస్ఎస్ పాఠశాలలు ఏర్పాటు చేస్తాం

**శిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లో భాజపా అధికారంలోకి వస్తే ఆర్ఎస్ఎస్ నిర్వహణలో స్కూళ్లు నడుపుతామని సినీ నటి, లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ ప్రకటించారు. ప్రస్తుతం హిమాచల్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్‌లో వెయ్యి విద్యా భారతి పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రతిపాదనను కంగన సమర్థించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే హిమాచల్‌లో కూడా అదే పని చేస్తామని శనివారం విలేకరులకు చెప్పారు. జాతికి ఆర్ఎస్ఎస్ గర్వకారణమని కొనియాడారు.









# తరచూ యాంటీ బయోటిక్స్ వాడుతున్నారా..



జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే యాంటీబయాటిక్స్ తీసుకోవడం చాలామందిలో సాధారణంగా మారింది. కొన్ని రోజులుగా లక్షణాలు తగ్గకపోయినా లేదా జ్వరం కొనసాగుతున్నా.. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ అయి ఉండొచ్చనే అనుమానంతో యాంటీబయాటిక్స్ వాడుతుంటారు. అయితే ప్రతి ఇన్ఫెక్షన్‌కు యాంటీబయాటిక్స్ అవసరం ఉండదు. ముఖ్యంగా వైరస్‌ల వల్ల వచ్చే అనారోగ్యాల్లో వీటి వాడకం ప్రయోజనం ఇవ్వకపోగా, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. జలుబు, ఇన్‌ఫ్లుయెంజా, తీవ్రమైన బ్రాంకైటిస్ వంటి సాధారణ అనారోగ్యాల్లో ఎక్కువగా వైరస్‌లే కారణమవుతాయి. యాంటీబయాటిక్స్ మాత్రం బ్యాక్టీరియాపై మాత్రమే పనిచేస్తాయి. కాబట్టి జ్వరం, దగ్గు లేదా గొంతునొప్పి వంటి లక్షణాలు ఉన్నంత మాత్రాన అది బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ అని నిర్ధారించలేమని, సరైన కారణాన్ని గుర్తించిన తర్వాతే తగిన చికిత్స తీసుకోవడం ముఖ్యమని వారు చెబుతున్నారు.

### యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం..

అవసరం లేకుండా ప్రతి సారి యాంటీబయాటిక్ కోర్సు తీసుకోవడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ సమస్య పెరిగే ప్రమాదం ఉంటుంది. అలాగే యాంటీబయాటిక్ ఉపయోగించినప్పుడు దానికి సున్నితంగా ఉండే బ్యాక్టీరియా నశిస్తాయి. కానీ నిరోధకత కలిగిన బ్యాక్టీరియా మాత్రం బతికి, మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా సమాచారం ప్రకారం, 2023లో ప్రపంచవ్యాప్తంగా సాధారణ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే ప్రయోగశాలలో నిర్ధారించిన బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లలో ప్రతి ఆరింటిలో ఒకటి యాంటీబయాటిక్ చికిత్సకు నిరోధకత చూపించిందని తేలింది. యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అనేది కేవలం ఆసుపత్రులకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు. అవసరం లేని సందర్భాల్లో యాంటీబయాటిక్స్ వాడటం ద్వారా కూడా ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. భవిష్యత్తులో సాధారణ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు కూడా మందులు సమర్థవంతంగా పనిచేయని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంటుంది. అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల వ్యక్తిగతంగా కూడా కొన్ని దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వికారం, విరేచనాలు, చర్మంపై దద్దుర్లు, ఇతర మందులతో ప్రతికూల పరస్పర చర్యలు, అలెర్జీ వంటి సమస్యలు వస్తాయి. అలాగే జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థకు సహాయపడే గట్ మైక్రోబయోమ్ అని పిలిచే శరీరంలోని సూక్ష్మజీవుల సమతుల్యత కూడా దెబ్బతింటుందని నిపుణులు తెలియజేస్తున్నారు. గట్ మైక్రోబయోమ్‌లో మార్పులు ఏర్పడటం వల్ల కొన్ని ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా క్లోస్ట్రిడియాయిడిస్ డిఫిసైల్ వంటి బ్యాక్టీరియా కారణంగా తీవ్రమైన విరేచనాలు, పెద్దప్రేగులో వాపు వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

ముక్కు నుంచి వచ్చే కఫం పసుపు లేదా ఆకుపచ్చ రంగులోకి మారితే అది తప్పనిసరిగా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌కు సంకేతమని చాలామంది భావిస్తారు. అయితే ఇది సరైన అభిప్రాయం కాదని అనారోగ్య సమయంలో శరీరంలో సహజంగా జరిగే రోగనిరోధక ప్రతిస్పందనలో భాగంగానే నాసికా స్రావం రంగు మారుతుందని, అలాగే జలుబు తగ్గిపోయిన తర్వాత కూడా కొంతకాలం దగ్గు కొనసాగడం వల్ల బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వచ్చిందని అనుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. అయితే యాంటీబయాటిక్స్‌ను పూర్తిగా నివారించాల్సిన అవసరం లేదు. బ్యాక్టీరియా వ్యాధి ఉన్నట్లు అనుమానం లేదా నిర్ధారణ ఉన్నప్పుడు అవి అవసరమైన చికిత్సగా మారుతాయి. బ్యాక్టీరియల్ న్యూమోనియా, స్ట్రెప్టోకోకల్ గొంతు ఇన్ఫెక్షన్, కొన్ని మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, కొన్ని సంక్లిష్టమైన చర్మ ఇన్ఫెక్షన్లలో యాంటీబయాటిక్స్ అవసరం అవుతాయి. అందువల్ల యాంటీబయాటిక్స్‌కు పూర్తిగా దూరంగా ఉండటం కాదు.. అవసరమైనప్పుడు మాత్రమే సరైన మందును ఉపయోగించడం ముఖ్యం. చికిత్సలో సరైన నిర్ధారణకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ఉందని నిర్ధారించడానికి తగిన ఆధారాలు ఉన్నాయా, కనిపిస్తున్న లక్షణాలకు మరేదైనా కారణం ఉండవచ్చా, న్యూమోనియా, సెప్సిస్ లేదా ఇతర తీవ్రమైన సమస్యలకు సంబంధించిన సూచనలు ఉన్నాయా అనే విషయాలను వైద్యులు పరిశీలించాలి. అవసరమైన సందర్భాల్లో మైక్రోబయాలజీ పరీక్షలు, యాంటీమైక్రోబయల్ ససెప్టిబిలిటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా ఇన్ఫెక్షన్‌కు కారణమైన సూక్ష్మజీవిని గుర్తించి, దానికి సమర్థవంతంగా పనిచేసే మందును ఎంపిక చేసుకోవచ్చు. ఐసీఎంఆర్ మార్గ దర్శకాలు కూడా కచ్చితమైన క్లినికల్ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు, అవసరమైన సందర్భాల్లో మాత్రమే అనుభవా ధారిత యాంటీబయాటిక్ చికిత్సను పరిమితం చేయాలని సూచిస్తున్నాయి.

### రోగుల పాత్ర కూడా కీలకమే..

యాంటీబయాటిక్స్ వినియోగంలో రోగుల పాత్ర కూడా కీలకమే. గతంలో వైద్యులు సూచించిన యాంటీబయాటిక్స్‌ను సొంతంగా తిరిగి వాడకూడదు. ఇతరులు ఉపయోగిస్తున్న మందులను కూడా తీసుకోకూడదు. లక్షణాలు తగ్గాయి లేదా పెరిగాయి అనే కారణంతో వైద్యుల సూచన లేకుండా చికిత్సను ప్రారంభించడం, ఆపడం చేయకూడదు. యాంటీబయాటిక్స్ అవసరం లేదని వైద్యులు సూచించినప్పుడు తగినంత విశ్రాంతి తీసుకోవడం, శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవడం, లక్షణాలను తగ్గించే చికిత్స తీసుకోవడం, ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఉండటం వంటి చర్యలు ఉపశమనానికి సహాయపడతాయి. యాంటీమైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్ అంటే రోగులకు చికిత్స నిరాకరించడం కాదు. సరైన వ్యాధికి సరైన మందును, సరైన మోతాదులో, సరైన వ్యవధిలో ఉపయోగించడమే దీని ప్రధాన ఉద్దేశం. యాంటీబయాటిక్ నిరోధకత పెరుగుతున్న సమయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న యాంటీబయాటిక్స్‌ను జాగ్రత్తగా ఉపయోగించడం భవిష్యత్తులో వాటి ప్రభావాన్ని కొనసాగించడానికి ఎంతో అవసరం. జలుబు వంటి సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు యాంటీబయాటిక్ తీసుకోవడం వల్ల కోలుకునే సమయం వేగవంతం కాదు. పైగా అనవసరమైన దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పాటు, భవిష్యత్తులో సాధారణ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు కూడా మందులు సరిగా పనిచేయని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే యాంటీ బయాటిక్ లను తీసుకునే ముందు ఈ మందు నిజంగా అవసరమా? అనే ప్రశ్న వేసుకోవడం చాలా ముఖ్యం. ఈ జాగ్రత్త ప్రస్తుత ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, భవిష్యత్తులో కూడా ప్రాణాలను రక్షించే యాంటీ బయాటిక్స్ ప్రభావవంతంగా ఉండేలా సహాయపడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

# సకలశాస్త్ర సమాహారం.. శ్రీకృష్ణతత్వం!



**భారతీయ ఆధ్యాత్మిక, తాత్విక, సాంస్కృతిక చరిత్రలో శ్రీకృష్ణ తత్వం ఒక మహత్తరమైన మార్గం. శ్రీకృష్ణుడు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది వేణువు, నెమలి పింఛం, రాధారాధన, గోపికలు, కురుక్షేత్ర యుద్ధం, అర్జునుడికి చెప్పిన భగవద్గీత మాత్రమే కాకుండా ఆయన చిన్నతనంలో చేసిన అల్లరిపనులు కూడా స్ఫురణకు వస్తాయి. కృష్ణుడి బాల్యంలో ఆయనలో కనిపించిన లీలాతత్వం, యౌవనంలో కనిపించిన ప్రేమ-భక్తి తత్వం, మధురలో కనిపించిన ధర్మరక్షణ, ద్వారకలో కనిపించిన రాజనీతి, కురుక్షేత్రంలో జ్ఞానబోధ ఇవన్నీ కలిపితేనే సంపూర్ణమైన కృష్ణతత్వం.**

శ్రీకృష్ణుడు కేవలం పురాణపురుషుడు మాత్రమే కాదు. ధర్మం, రాజనీతి, తత్వశాస్త్రం, యోగం, భక్తి, జ్ఞానం, కర్మ, మనోవిజ్ఞానం, సామాజిక బాధ్యత లాంటి అనేక శాస్త్రాల సమాహారం. భక్తి కోణంలో ఆయన భగవంతుడు, చరిత్ర ఇతిహాస కోణంలో మహాభారతంలోని కీలక వ్యక్తి, తత్వశాస్త్ర కోణంలో గీతాచార్యుడు, నాయకత్వ కోణంలో వ్యూహకర్త, మనోవిజ్ఞాన కోణంలో సంక్షోభంలో ఉన్న అర్జునుడికి మార్గదర్శి, సామాజిక కోణంలో వ్యవస్థను, సమాజాన్ని కాపాడే నాయకుడు, ఆధునిక ఆలోచనా కోణంలో పరిస్థితిని విశ్లేషించి, భావోద్వేగాలను నియంత్రించి, అందుబాటులో ఉన్న సమాచారంతో నిర్ణయం తీసుకుని తన బాధ్యతలను నిర్వర్తించమని చెప్పే మనోవిజ్ఞానవేత్త.

కృష్ణస్తు భగవాన్ స్వయం అని వ్యాసుడన్నట్లు కృష్ణుడు స్వయం అవతరణ. భగవంతుడే స్వయంగా మానవుడిగా వచ్చిన రూపం. శ్రీకృష్ణుడు మనకు బాగా తెలిసిన దైవం. సమాజప్రక్షాళన అతని కార్యక్రమం. మనకు ఆయనను గురించి తెలుసు అనుకుంటాం కానీ, ఆయన తత్వంలోని పరమార్థం మనకు ఏమాత్రం తెలియదు. బృందావనంలో ఆటలు, రేపల్లెలో లీలలు .. ఇలా ఇవన్నీ ఆయన 125 సంవత్సరాల దీర్ఘ జీవితంలో మొదటి 12 సంవత్సరాలు మాత్రమే కనిపిస్తాయి! కానీ, శ్రీకృష్ణుడి పాత్ర ద్వాపర యుగాంతం వరకు ఉంటుంది. ఆయన జీవితంలో ప్రతీ అంశం ఏదో ఒక శాస్త్రంతో ముడిపడి ఉన్నట్లుగా భాగవతం, భారతాలలోని పలు ఘట్టాలు చెబుతాయి.

శ్రీకృష్ణుడిలోని బహుముఖాలను దర్శిస్తే ద్వారక నిర్మాణంతో వాస్తుశిల్పి, అర్జునుడి మానసిక సంఘర్షణను రూపుమాపి యుద్ధం చేయించిన సైకాలజిస్టు, తన వేణుగానంతో సకలజనులను సమ్మోహనపరిచిన సంగీతకారుడు, ఆరోగ్యం, జీవనశైలి, ఆయుర్వేద సంప్రదాయాలతో అనుసంధానమై గోవు ప్రాముఖ్యాన్ని చాటిన వైద్యుడు. ధర్మరక్షణ, యుద్ధ నిర్ణయాలతో మహా వీరుడయ్యాడు. ద్వారకపాలనతో రాజనీతిజ్ఞుడు, గోవర్ధనగిరి ఉద్ధరణ ఘట్టం, వర్షం-యజ్ఞంపై భగవద్గీతలో చెప్పిన చర్చ వంటి వాటితో క్లైమటాలజిస్ట్. అంతేకాదు గతి, భ్రమణం, వేగం వంటి భౌతిక శాస్త్ర సూత్రాలతో సుదర్శన చక్రాన్ని నియంత్రించిన కైనెటిక్ ఇంజినీర్, ఇలా బహుముఖ ప్రజ్ఞలతో నేటి తరానికి తన జీవనాన్ని ఆదర్శంగా మలిచాడు. శ్రీకృష్ణుడు ఒక గొప్ప రాజకీయవేత్త కూడా! పాండవుల తరఫున శాంతి రాయబారిగా వెళ్లడం, యుద్ధాన్ని నివారించేందుకు ప్రయత్నించడం, చివరికి ధర్మయుద్ధంలో వ్యూహాత్మకంగా మార్గనిర్దేశనం చేయడం ఆయన రాజకీయ దూరదృష్టిని చూపుతుంది.

'వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనం దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుం..' ఆయన ముఖ్యమైన తత్వం జగద్గురు తత్వం. గీతాచార్యుడుగా ఆయన జగద్గురు వయ్యాడు. ఆయన అర్జునుడికి కేవలం యుద్ధం చేయమని చెప్పలేదు. ఏది ధర్మం, ఏది అధర్మం, ఏది శాశ్వతం, ఏది అశాశ్వతం అనే వివేకాన్ని ముందుగా బోధించి ఆ తర్వాత యుద్ధం చేయమన్నారు. 'యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత' అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు ప్రకటించిన ధర్మసిద్ధాంతం కేవలం ఒక కాలానికి సంబంధించినది కాదు. సమాజంలో ధర్మం బలహీనపడినప్పుడు, అధర్మం పెరిగినప్పుడు, ధర్మాన్ని పునఃస్థాపించడానికి ప్రతీ వ్యక్తి తన వంతు బాధ్యతను సర్వకాలాలలో నిర్వర్తించాలనే సందేశంతో కూడుకున్నది.

శ్రీకృష్ణుడు అంటేనే యోగం. ఆయన మహాయోగి. భగవద్గీతలో ప్రతీ అధ్యాయం యోగమే. అందుకే 'యోగక్షేమం వహామ్యహం' అంటాడు పరమాత్మ. యోగమంటే లేనిది లభించడం, క్షేమమంటే ఉన్నది నిలబడటం. కృష్ణతత్వం చెప్పేది మొదటగా శాంతియే కానీ అధర్మం శాంతిని దుర్వినియోగం చేస్తే ధర్మరక్షణ కోసం కఠిన నిర్ణయం అవసరమంటారు. శ్రీకృష్ణతత్వంలో వేదాంతం కనిపిస్తుండగా అందులో అత్యున్నతమైన అంశం ఆత్మజ్ఞానం. భగవద్గీతలో కృష్ణుడు అర్జునుడికి శరీరం నశించినా ఆత్మ నశించదని వివరిస్తాడు. ఆత్మకు జననం, మరణం లేవనే భావన ద్వారా శ్రీకృష్ణుడు మనిషిని భౌతికభయాల నుంచి ఆధ్యాత్మిక ధైర్యం వైపు నడిపిస్తాడు.

మరో అంశం కర్మశాస్త్రం. ఇందులో కర్తవ్యమే మార్గమని చెబుతారు. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన..' మనిషికి తన కర్తవ్యంపై అధికారం ఉంది కానీ దాని ఫలితంపై సంపూర్ణ నియంత్రణ ఉండదంటారు. ఇది మనిషి జీవితంలో ఉద్యోగం, విద్య, కుటుంబం, సమాజసేవ ప్రతీ రంగానికి వర్తించే జీవనసూత్రం. ప్రస్తుత సమాజంలో భగవద్గీత వృద్ధులకు మాత్రమే పనికి వచ్చే పుస్తకమనుకుంటున్న యువత తెలుసుకోవలసినది ప్రతీ మనిషి తన నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతీ సంఘర్షణకు మార్గం చూపించేది గీత. దానిని మించిన మేనేజ్‌మెంట్ పుస్తకం ప్రపంచంలో మరొకటి కనిపించదు.

శ్రీకృష్ణుడి తత్వం మనిషి జీవితంలోని ప్రతీ సమస్యకు ఏదో ఒకవిధంగా ఆలోచించే మార్గాన్ని చూపించే పరిష్కారమవుతుంది. కృష్ణుడిని కేవలం పూజించడమేనా లేక ఆయన ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవడమా.. ఏం చేయాలి.. ఎందుకు చేయాలి.. ఈ ప్రశ్నలకు కృష్ణుడి మార్గమే సమాధానం చెబుతుంది. కృష్ణుడు కేవలం దేవతాస్వరూపం మాత్రమే కాదు.. మనిషి, మనసు, సమాజం, నిర్ణయం, నాయకత్వం గురించి ఆలోచించడానికి వేల సంవత్సరాలుగా మన ముందున్న ఒక మహత్తరమైన ప్రశ్నతో కూడిన సమాధానం. ఆయన చెప్పిన మాటలను మన జీవితంలో ఎంతవరకు అర్థం చేసుకుని ఆచరిస్తున్నామన్నదే కృష్ణుడి ఆరాధనలో పరమార్థం. కృష్ణతత్వం ఒక మతపరమైన ఆరాధనా భావనకు మాత్రమే పరిమితం కాకుండా.. అది మనిషి ఎలా ఆలోచించాలి, ఎలా నిర్ణయం తీసుకోవాలి, ఎలా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి, ఎలా సమాజానికి ఉపయోగపడాలి, చివరికి తన నిజమైన స్వరూపాన్ని ఎలా తెలుసుకోవాలి అనే ప్రశ్నలకు మార్గనిర్దేశనం చేసే సమగ్ర జీవనదర్శనం.




# సరికొత్త అవతారంలో రష్మిక..

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. "సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి" అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.

# తొలి నటిగా మమిత రికార్డు

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు.. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది.

జననాయగన్..: ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్'.. విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది.

**విశ్వనాథ్ అండ్ సన్స్..:** సూర్య కథానాయకుడిగా వచ్చిన ఈ భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది.

బెత్లెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.





Bhagyashri Borse

# 'పెద్ది' తర్వాత శివరాజ్ కుమార్ మరో తెలుగు సినిమా..



కన్నడ హీరో శివరాజ్ కుమార్.. సొంత భాషలో సినిమాలు చేస్తున్నప్పటికీ తెలుగులోనూ నటించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అలా ఈ ఏడాది రిలీజైన రామ్ చరణ్ 'పెద్ది'లో కీలక పాత్ర చేశారు. తనదైన నటనతో ఆకట్టుకున్నారు. ఇప్పుడు 'కూర్మావతార్' అనే డివోషనల్ మూవీలోనూ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్ర టీజర్ ఇప్పుడు రిలీజైంది. రాజ్ తరుణ్, వరలక్ష్మి శరత్ కుమార్, శివరాజ్ కుమార్ ఇందులో ప్రధాన పాత్రధారులు. మనలో చాలామందికి తెలిసిన కూర్మావతారం అనే డివోషనల్ టాపిక్‌ని ఇప్పటి ట్రెండ్‌కి తగ్గట్లు తీసినట్లు టీజర్ చూస్తుంటే అనిపించింది. విజువల్స్, సాయికుమార్ వాయిస్ ఓవర్ బాగానే ఉంది. హర్షవర్ధన్ కడియాల దర్శకుడు. త్వరలో పాన్ ఇండియా వైడ్ థియేటర్లలో రిలీజ్ చేస్తామని ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.